ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 21 నవంబరు 2024





రూ.కోట్లలో.. కిక్

- అందుబాటులో కోరుకున్న మద్యం
- నెల వ్యవధిలో రికార్డు స్థాయిలో అమ్మకాలు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూ.260 కోట్లకు తాగేశారు
- బాపట్ల జిల్లాలో రూ.86 కోట్ల మద్యం విక్రయం
- జగన్ హయాంలో కన్నా ఒక్క నెలలో రూ.20 కోట్ల అదనపు సేల్

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుకున్న బ్రాండ్లు.. కావాల్సిన మద్యం.. గతంలోలా చెల్లింపులకు పరిమితులు లేకపోవడం.. కొన్ని బార్లలోనూ ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు.. నేపథ్యంలో అటు మందుబాబులు, ఇటు ఎక్సైజ్ శాఖ ఖుషీ చేసుకుంటోంది. మందుబాబులు తెగ తాగేస్తోండగా.. ఎక్సైజ్ శాఖకు రూ.కోట్లు కిక్కు వస్తోంది. బ్రాందీ షాపుల విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మందుబాబులు పండుగ చేసుకుంటున్నారు. జగన్ హయాంలో గత ఐదేళ్ళుగా జేబులో దండిగా డబ్బులున్నా కూడా కోరుకున్న మద్యాన్ని కొనుక్కొని తాగలేని పరిస్థితి ఉండేది. పేరొందిన డిస్టలరీల కంపెనీలు ఉత్పత్తి చేసే మద్యంకు బదులు జే బ్రాండ్ పేరుతో నాశిరకం మద్యాన్ని ప్రభుత్వ దుకాణాల్లో అమ్మించారు. గత్యంతరం లేక పలువురు నాశిరకం మద్యాన్ని కొనుగోలు చేసి తాగి ఆరోగ్యాన్ని గుల్ల చేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోరుకున్న మద్యం అందుబాటులోకి తెస్తామని, చౌక మద్యాన్ని నాణ్యంగా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే

(మిగతా 6వ పేజీలో..)



అడకత్తెరలో.. వీఆర్వోలు

ఒక పక్క ఎమ్మెల్సీ ఓటర్ల పరిశీలన, సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సిద్ధం చేసేపని... మరోపక్క హౌస్ హోల్డ్ సర్వేకు సంబంధించి జియో కో ఆర్డినేట్స్ తీసుకోవాల్సిన పని. వీటి లో ఓట్ల పరిశీలన రెవెన్యూ అధికారులు చూస్తుం టే, హౌస్ హోల్డ్ సర్వే ఎంపీడీవో పర్యవేక్షణలో జరుగుతోంది. ఈ రెండింటికీ వీఆర్వోలు వెళ్లాల్సిందే. అయితే ఇక్కడే అసలు చిక్కు వచ్చిపడితే, వివిధ శాఖల మధ్య వైసీపీ సర్కారు పెట్టిన చిచ్చు మెల్లగా రాజుకుంటోంది. వీఆర్వోలను విధులకు పంపే విషయంలో ఎవరి అధికారాన్ని వారు చూపిస్తుంటే, మధ్యలో వీఆర్వోలు నలిగి పోతున్నారు.

- గత వైసీపీ సర్కారు పాలనలో చేసిన మార్పులే కారణం
- సచివాలయాల ఏర్పాటు మినహా పటిష్ట నిర్వహణ లేకే
- వీఆర్వోలు పనిచేసేది రెవెన్యూలో... వేతనం ఇచ్చే అధికారం ఎంపీడీవోలకు
- తహసీల్దార్, ఎంపీడీవోల మధ్య పెరుగుతున్న దూరం
- ఎన్నికల విధులు, హౌస్ హోల్డ్ సర్వేల పనుల్లో గందరగోళం
- మా ఉత్తర్వులు ఫాలో అవ్వాలంటే మా ఉత్తర్వులంటూ ఆధిపత్య పోరు
- ఛార్జిమెమోలు, వేతనాల నిలుపుదల వరకు ముదిరిన వ్యవహారం
- కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళుతున్న వీఆర్వోలు

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు తప్పనిసరి కావటంతో ఓటర్ల దరఖాస్తుల పరిశీలనకు వెళ్లాలో, సర్వేకు వెళ్లాలో తెలియని సందిగ్ధంలో కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపమన్నట్టు తయారయింది వీఆర్‌ఓల పరిస్థితి. ఓపక్క తహసీల్దార్లు వారు చెప్పిన విధులకు వెళ్లాలని ఆదేశాలిస్తుంటే, మరోపక్క ఎంపీడీఓలు మాకు తెలియకుండా మీ ఇష్టమొచ్చినట్టు వెళ్ళిపోతే ఎట్లా! జీతమిచ్చేది మేమయితే మా మాట ఎందుకు వినరంటూ మెమోలు ఇచ్చే పరిస్థితి నుంచి చివరకు జీతాలు ఆపేస్తామని బెదిరించే వరకు వెళ్లిందంటే వారిమధ్య అధికారిక పోరు ఎంతవరకు వెళ్లిందనేది అర్థమవుతుంది. విధులు సక్రమంగా చేద్దామనుకునే వీఆర్‌ఓల పరిస్థితి ఇబ్బందికరంగా మారితే, తహసీల్దార్, ఎంపీడీఓల మధ్య ఏర్పడుతున్న సమన్వయ లోపాన్ని కొందరు వీఆర్‌ఓలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. అసలు విధులలోనే లేకుండా తహసీల్దార్ అడిగితే, ఎంపీడీఓ రమ్మన్నారని, ఎంపీడీఓ ఫోన్ చేస్తే, తహసీల్దార్ మరో పనికి పంపారంటూ ఇద్దరి దగ్గర ఒకరిపైఒకరికి చెప్పి తప్పించుకు తిరుగుతున్న పరిస్థితి కూడా ఉంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొన్ని మండలాల్లో రెండు శాఖల మధ్య చిచ్చు రాజుకుంటూనే ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారం కలెక్టర్‌ల దృష్టికి తీసుకువెళ్లాలని, అప్పటికీ పరిష్కారం కాకుంటే ఆందోళనకు దిగాలనే ఆలోచనకు వీఆర్‌ఓలు వచ్చినట్టు చెబుతున్నారు. దీనంతటికీ వైసీపీ సర్కారు కాలంలో వీఆర్‌ఓల విధులు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్నా, సచివాలయాల ఏర్పాటు తర్వాత వారితోపాటే వీరి వేతనాలు కూడా ఎంపీడీఓలు ఇచ్చేలా మార్పులు చేయటమే. అయితే రెండూ ప్రభుత్వ శాఖలే కావటంతో వారి మధ్య అధికారిక పోరు లేకుండా సమన్వయంతో పనిచేస్తే అంత సమస్య అయ్యేదికాదు. మొత్తం మీద గత వైసీపీ సర్కారు చేసిన అనాలోచిత మార్పులు ఇప్పుడు ప్రభుత్వ శాఖల్లో చిచ్చు రేపటానికి కారణమవుతోంది.

అంతా ఓటర్ల జాబితా బిజీలో

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా సిద్ధంచేసే పని ఒకప క్షన ఉంటే, ఈ నెల 6 నుంచి బుధవారం వరకు ఓటరు దరఖాస్తుల పరిశీలన పనిలో వీఆర్‌ఓలు ఉన్నారు. ఈ నెల 23న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కూడా విడుదల కానుంది. అప్పటి నుంచి డిసెంబర్ 7 వరకు మళ్లీ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, ఇతర లోపాల పరిశీలన పని ఉంటుంది. వీటిని తప్పనిసరిగా బీఎల్‌ఓలే చెయ్యాల్సి ఉంది. త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా సిద్ధంచేసే పనికూడా జరుగుతోంది. దీనికి ఓటర్ల దరఖాస్తులు ఉండవు. అయితే నీటిపారుదల శాఖ ఇచ్చిన ఆయకట్టుదారుల వివరాల ఆధారంగా రెవెన్యూ శాఖే ఓటర్ల జాబితా సిద్ధం చేయాల్సి

(మిగతా 8వ పేజీలో..)

కాలుష్య కోరలతో అంతరించిపోతున్న విశిష్ట మత్స్యజాతులు

ఎగుమతుల్లోనూ వెనకడుగే

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం



8

మత్స్య విలాపం!

6

చదువుతోపాటు ఆటలపై ఆసక్తి ఉండాలి

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ బాపట్ల వ్యవసాయ కళాశాల

పొదుపు సొమ్ము రూ.10 లక్షలు గోల్‌మాల్

- రుణాల చెల్లింపు నగదును స్వాహా చేసిన యానిమేటర్
- పొన్నూరు మండలం దొప్పలపూడిలో వెలుగుచూసిన వైనం

మొక్కజొన్న దిగుబడి పెంచే దిశగా పరిశోధనలు

- ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మిదేవి

8

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- మృత్యువుతో పోరాడుతున్న భర్త
- పెదకాకాని మెయిన్ సెంటర్‌లో ఘటన

దౌర్జన్యం కేసులో ముగ్గురి పేర్లు వెల్లడి

- ముగిసిన తుళ్లూరు పోలీసుల విచారణ
- రౌడీషీటర్ బోరుగడ్డ బెయిల్ పిటిషన్లు డిస్మిస్

ముసాయిదా ముద్రణకు సిద్ధం

- పట్టభద్రుల దరఖాస్తులు దాదాపు పరిష్కారం
- బుధవారం సాయంత్రానికి 5 శాతమే పెండింగ్
- ఓటు కోసం 3లక్షల 32వేల 783మంది దరఖాస్తు
- 23న డ్రాఫ్టు లిస్టు విడుదల చేస్తామన్న ఈఆర్‌వో కాజావలి

జేకేసీ విద్యార్థి కావడం గర్వకారణం

- ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణిస్తున్న పూర్వ విద్యార్థులు
- ఆడిటోరియం ప్రారంభోత్సవంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు



సభలో మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు, వేదికపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మన్నవ మోహనకృష్ణ, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, చుక్కపల్లి రమేష్ తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల ఎంతో మంది ఉన్నతికి కారణమైంది. ఇలాంటి కళాశాల విద్యార్థినని చెప్పుకోవడం గర్వకారణం. కళాశాలలో అధ్యాపకులు, యాజమాన్యం చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించారు. ఫలితంగా ఇక్కడ చదివిన ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణిస్తున్నారు.. అని రాష్ట్ర డీజీపీ, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థి సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. జాగర్లమూడి లక్ష్మయ్యచౌదరి పేరుతో నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పునర్ నిర్మించారు. రూ.2.50 కోట్లు వ్యయంతో నిర్మించిన ఈ ఆడిటోరియాన్ని బుధవారం డీజీపీ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా డీజీపీ ప్రసంగిస్తూ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఎంతోమందికి చదువుతో పాటు సంస్కారం నేర్పించిన ఘనత జేకేసీదన్నారు. ఆకృతిలేని రాళ్ళలాంటి తమలాంటి ఎంతోమందిని శిల్పాలుగా తీర్చిదిద్దిన ఘనత జేకేసీ అధ్యాపకులదన్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం జేకేసీ కళాశాలలో చదువుకున్నానని, అప్పట్లో ఇక్కడ నేర్పిన చదువు, క్రమశిక్షణ కారణంగానే నేషనల్ పోలీసు అకాడమీలో చేరినట్లు చెప్పారు. ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ తమకు క్రమశిక్షణ, అంకితభావం కళాశాలలో చదుకునే సమయంలో అలవడ్డాయన్నారు. ఫలితంగానే సేవా, రాజకీయరంగాల్లో రాణిస్తున్నట్లు వారు చెప్పారు. జేకేసీ పూర్వ విద్యార్థులు కావడం తమ అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపిచంద్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు యర్లగడ్డ ఉమాదేవి, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మాదల శ్రీనివాసు, చుక్కపల్లి రమేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ, కళాశాల పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రకృతిని ప్రేమిద్దాం.. కాపాడుదాం

- భావితరాలకు మంచి పర్యావరణాన్ని ఇవ్వాలి
- కార్తీక వనసమారాధనలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించాలని, దానిని కాపాడాలని కలెక్టర్ వెంకటమురళి పిలుపిచ్చారు. అటవీశాఖా ఆధ్వర్యంలో సూర్యలంక సముద్రతీరంలో బుధవారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు నాటి నీరు పోశారు. అధికారులతో కూడా మొక్కలు నాటించారు. తదుపరి అధికారులతో కలిసి కార్తీక వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. రాబోయే తరాలకు మంచి పర్యావరణం అందించడానికి ఇప్పుడు నాటే మొక్కలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ప్రకృతిని ప్రేమించి చెట్లను, జంతువులను, పక్షులను సంరక్షించాలన్నారు. పరిశ్రమల స్థాపనతో గడిచిన 155 ఏళ్ళల్లో ప్రపంచవ్యాప్తంగా 2 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగిందన్నారు. ఉష్ణోగ్రతలలో మార్పులను నియంత్రించాలంటే విరివిగా మొక్కలను నాటాలన్నారు. అటవీశాఖ ద్వారా జిల్లాలో 63 వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, అటవీశాఖాధికారి భీమయ్య, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీపీవో ప్రభాకర్, తహసీల్దార్ షేక్.సలీమా, వ్యవసాయాధికారి ఎ.రామకృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రాణనష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారే అవకాశం ఉందన్నారు. ఈ నెల 27 వరకు మత్స్యకారులను వేటకు వెళ్ళనివ్వరాదని చెప్పారు. ఇప్పటికే చేపల వేటకు వెళ్ళిన మత్స్యకారులను వెంటనే బయటకు పిలిపించాలని ఆదేశించారు. ధాన్యాన్ని 22 నుంచి 27వ తేదీ వరకు కోయరాదన్నారు. భారీవర్షాలతో లోతట్టుప్రాంతాలు మునిగితే తక్షణమే ఆ ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు మండల కేంద్రాల్లోనే విధిగా నివాసం ఉండాలన్నారు. ఎంపీడీవోలు మండలాలు విడిచి వెళ్ళరాదన్నారు. సహాయక చర్యల కొరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులు, పెంపుడు జంతువులను సురక్షిత ప్రాంతాలలో ఉంచుకోవాలన్నారు.



సిబ్బందితో కలిసి వనభోజనాలు చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి



సూర్యలంక తీరంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

డీఎంను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు

నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం చంద్రశేఖర్‌ను సరెండర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను వీసీఎండీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ సరెండర్ ఉత్తర్వులు వెలువడి నాలుగు రోజులు అవుతున్నప్పటికీ బుధవారం వెలుగులోకి వచ్చాయి. ప్రైవేటు గోడౌన్ల లీజు కొనసాగింపు విషయంలో అవకతవకలు జరిగాయని, వాటికి పరోక్షంగా డీఎం సహకరించారని ఆరోపిస్తూ కర్లపాలెం మండలానికి చెందిన కొంతమంది నేరుగా సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. జిల్లా అధికారులు విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలోనే ఆయనపై సరెండర్ వేటు వేసినట్లు తెలుస్తోంది. జిల్లా పౌరసరఫరాల విభాగం అధికారి విలియమ్స్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ధాన్యం సేకరణకు సంబంధించిన ప్రక్రియ ముమ్మరంగా సాగుతుండడంతో మిల్లుల నుంచి బ్యాంకు గ్యారెంటీలు తీసుకునే విషయంపై దృష్టి సారించినట్లు సివిల్ సప్లయిస్ ఇన్‌చార్జి అధికారి విలియమ్స్ తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

- నేడు విడుదల చేయాల్సిన నోటిఫికేషన్ నిలిపివేత
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- సిద్ధమైన ఓటర్ల జాబితాలు.. ఏడు లక్షల మందికి ఓటు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ఎన్నికలకు అధికారులు సిద్ధమవగా.. తమకు గ్రామాల్లో పట్టు ఉందని నిరూపించుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాలు పన్నుతుండగా ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను వాయిదా వేసింది. ఎన్నికలకు సంబంధించి గురువారం విడు దల చేయాల్సిన నోఫికేషన్ ను ప్రభుత్వం నిలిపివేసిం ది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎన్నికలను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులు విడుదలయ్యే వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపి వేయాలని అధికారులను ప్రభు త్వం ఆదేశించింది. నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ) పరిధిలోని టీసీల వారీగా రైతుల జాబితాలను సిద్ధం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటి పరిధిలో 2,628 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో దాదాపు 12 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 2,500 మంది నుంచి 3,000 వరకు రైతులను ఓటర్లుగా నమోదు చేశారు. సుమారు ఏడు లక్షల మందిని ఓటర్లుగా అధికారులు గుర్తించారు. ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహిం చేందుకు 2,628 టీసీల వారీగా ఓటర్ల జాబితాలను అధికారులు విడుదల చేశారు. తొలుత టీసీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వ ఆదేశాలతో నోటిఫికేషన్ నిలిచిపోయింది. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.

మునిపల్లెలో చారిత్రక ఆనవాళ్లు గుర్తింపు



మునిపల్లెలోని వీరగల్లు శాసనం

పొన్నూరుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో పురావస్తు చారిత్రక ఆనవాళ్లు అయిన వీరగల్లు శాసనం లభ్యమైనట్లు యువ పురావస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్ రెడ్డి బుధవారం తెలిపారు. మునిపల్లె గ్రామానికి చెందిన పల్లెపోతల సుబ్రహ్మణ్యం, సూధనగుంట శ్రీనివాస్ ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం శ్రీనాథ్‌రెడ్డి మునిపల్లె గ్రామానికి వచ్చి శాసనాలను పరిశీలించారు. అగస్తేశ్వర ఆలయంలో నంది బొమ్మ చెక్కిన శిలాఫలకంపై ఉన్న శాసనాన్ని పరిశీలించారు. ఈ శాసనం భూమిలోపల ఉండగా, ఇటీవలే ఆలయ మరమ్మతుల్లో భాగంగా పైకి లేపారు. మట్టి లోపల ఉండటం చేత ఈ శాసనం చాలా భాగం చదవటానికి వీలు లేకుండా పోయింది. కేవలం కొద్దిపాటి అక్షరాలు మాత్రమే గుర్తించ గలుగుతున్నట్లు శ్రీనాథ్ రెడ్డి వెల్లడించారు. 18, 19 శతాబ్దాలకు చెందిన తెలుగు లిపిలో గ్రామ విషయాలు ఉన్నట్లు చెప్పారు.

గోళ్లమూడిపాడు రోడ్డులో..



వీరగల్లు శాసనాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి

అలాగే గ్రామ శివారులోని గోళ్లమూడిపాడు రోడ్డులో పంట పొలాల్లో కూరుకుపోయి ఉన్న వీరగల్లు శిల్పాని శ్రీనాథ్ రెడ్డి గుర్తించారు. ఈ శిల్పం పూర్వకాలంలో గ్రామ పెద్ద, ఒక అధికారి, గ్రామ సంరక్షణలో భాగంగా యుద్ధంలో లేదా జంతువులతో పోరాడుతూ మరణించిన వారి గుర్తుగా ప్రతిభను చెక్కినట్లు తెలిపారు. సుమారు మూడు అడుగుల పొడవున్న ఈ వీరగల్లు శిల్పంపై ఒక పురుషుడు, ఇరువైపులా స్త్రీల ప్రతిమలు ఉన్నాయి. ఇవి గ్రామ చరిత్రకు ఆనవాళ్లు అని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు

నరసరావుపేట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పమిడిపాడు గ్రామానికి చెందిన కొల్లా సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తాటికుర్తి రవికిషోర్‌రెడ్డి, గాడిపర్తి వంశీకృష్ణ, గాడిపర్తి దయాసాగర్, గాడిపర్తి ప్రసాద్, గాడిపర్తి శ్రీనివాసరావు, పొదిలి మదార్‌సాహెబ్‌లపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కిషోర్ తెలిపారు. కొల్లా సాంబశివరావుకు నరసరావుపేట మండలం అర్వపల్లి గ్రామంలో 6 ఎకరాల పొలం ఉందనీ, 2022 మార్చి 18న ఈ ఏడుగురు తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, తనను బెదిరించి, తనపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కిషోర్ తెలిపారు.

పత్తి కొనుగోళ్లలో లోటుపాట్లపై కేంద్రానికి నివేదిక

- సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ



మార్కెటింగ్, సీసీఐ అధికారులతో మాట్లాడుతున్న విజయ్ కురదగీ

గుంటూరు సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పత్తి కొనుగోళ్లలో లోటుపాట్లను గుర్తించి కేంద్రానికి నివేదిక అందజేయనున్నట్లు సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ వెల్లడించారు. బుధవారం ఆయన గుంటూరు, పల్నాడు జిల్లాలోని సీసీఐ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ పత్తి రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల సమీపంలోని గాయత్రి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో స్వయంగా తేమశాతం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ బూసిమి రాజబాబు ఉమ్మడి జిల్లాలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీసీఐ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తేమశాతంలో సడలింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లుల యజమానులతో కూడా సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

మరో అధికారి రాక...

ఉమ్మడి జిల్లాలో సీసీఐ పనితీరును పరిశీలించేందుకు కేంద్రం నుంచి మరో మహిళా అధికారి రానున్నారు. గురువారం ఆమె ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిసింది. పత్తి కొనుగోలు వ్యవహారంలో సీసీఐ పనితీరును పరిశీలించి, సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఫిర్యాదు, విజ్ఞప్తి మేరకు ఈ అధికారులను కేంద్రం ఆఘమేఘాల మీద గుంటూరు జిల్లాకు పంపుతున్నారు.

ఎనిమిది ప్రారంభం... నాలుగు సెంటర్లలో కొనుగోళ్లు

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 15 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేశారు. అయితే వాటిలో ఎనిమిది సెంటర్లు ప్రారంభించినా, కేవలం నాలుగు సెంటర్లలో మాత్రమే పత్తి కొనుగోలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల కూడా రైతులు పత్తి అమ్మకాలకు ఇబ్బంది పడుతున్నారు. కొందరు బయ్యర్లు అతి భయంతో కొనుగోలుకు దూరంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మొక్కజొన్న దిగుబడి పెంచే దిశగా పరిశోధనలు



డాక్టర్ సంతోష్ కుమార్ సింగ్‌ను సన్మానిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి దేవి

గుంటూరు సిటీ, తాడికొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు నికరాదాయాన్ని అందించే మొక్కజొన్న దిగుబడి పెంచే దిశగా పరిశోధనలు జరుపుతున్నట్లు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి దేవి వెల్లడించారు. బుధవారం తాడికొండ మండలం లాం లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ సీనియర్ అగ్రికల్చరల్ స్పెషలిస్ట్ డా.సంతోష్ కుమార్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా విస్తరణ సంచాలకులు డా. జి.శివన్నారాయణ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ అధికారులతో రాష్ట్రంలో వ్యవసాయ స్థితిగతులు, విశ్వవిద్యాలయ పాత్ర మొదలగు విషయాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి దేవి మాట్లాడుతూ వరి, వేరుశనగ, అపరాలు, చిరుధాన్యాలు మారిన వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ మేలైన దిగుబడినిచ్చే పంటల రకాలను తయారు చేయడంలో విశ్వవిద్యాలయం ముందుందని తెలిపారు. పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి విడుదలైన వరి రకాలు పలు రాష్ట్రాల్లో అధికంగా సాగులో ఉన్నాయని తెలియజేశారు. డాక్టర్ సంతోష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ నికర సాగు భూమి రోజురోజుకీ తగ్గుతున్న పరిస్థితుల్లో మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ, దిగుబడి పెరిగే విధంగా పరిశోధనలు చేయాలని, మొక్కజొన్నలో ముఖ్యంగా పిండి పదార్థం ఎక్కువ ఉండే రకాలను తయారు చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ డా.జి.రామచంద్రరావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్‌రావు, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ, డీన్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ బి.శ్రీలక్ష్మి, డీన్ ఇంజినీరింగ్ డా.ఎ.మణి, యూనివర్సిటీ లైబ్రేరియన్ డా.పి.సాంబశివరావు పాల్గొన్నారు. డాక్టర్ సంతోష్ కుమార్ సింగ్‌ను సన్మానించారు.

రూ.కోట్లలో.. కిక్

(5పేజీ తరువాయి)

అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అప్పటి వరకు కొనసాగుతున్న మద్యం పాలసీని మార్చేశారు. ప్రభుత్వ దుకాణాల స్థానే ప్రైవేటు దుకాణాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉండే కేవలం నగదు లావాదేవీలు తొలగించి డిజిటల్ పేమెంట్స్‌ను కూడా అమల్లోకి తెచ్చారు. గత నెల దసరా పండుగ రోజు నుంచి కొత్త మద్యం షాపులు వెలిశాయి. అప్పటి వరకు కేవలం జేబులో నగదు ఉంటే మాత్రమే మద్యం కొనుక్కునే అవకాశం ఉండేది. డిజిటల్ లావాదేవీలు అమల్లోకి రావడంతో క్రెడిట్‌కార్డులు ఉన్నవారు సైతం ఎంచక్కా వైన్ షాపులకు వెళ్ళి మద్యం కొనుగోలు చేస్తున్నారు. దసరా పండుగ ముందు వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరికే మద్యం బ్రాండ్ల పేర్లు కూడా వింతగా ఉండేవి. బూమ్..బూమ్, బ్రిటీష్ ఎంపైర్ వంటి బీర్లు, ఆంధ్రగోల్డ్ విస్కీ, హైదరాబాద్ బ్లూ విస్కీ, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీలు వంటివి మాత్రమే అందుబాటులో ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేసిన కొత్త మద్యం షాపుల్లో ఏ బ్రాండ్ మద్యమైనా అందుబాటులోకి వచ్చింది. కింగ్ ఫిషర్, బడ్వైజర్, నాకౌట్ వంటి ప్రముఖ బ్రాండెడ్ బీర్లు దొరుకుతున్నాయి. దీంతో ఈ నెల రోజుల్లో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. గత నెల 16 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు అంటే 30 రోజుల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూ.259 కోట్ల 19లక్షల అమ్మకాలు జరిగాయి. ఇందులో రూ.208 కోట్ల విలువ చేసే మద్యం కేవలం కొత్తగా ఏర్పాటు చేసిన వైన్ షాపుల ద్వారానే జరిగింది. మిగతా అమ్మకాలు బార్లు, క్లబ్‌లలో జరిగాయి. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో భాగంగా గుంటూరు జిల్లాలో 127, పల్నాడు జిల్లాలో 129, బాపట్ల జిల్లాలో 117 కొత్తగా వెలిశాయి. అయితే బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కంటే గుంటూరు జిల్లాలోనే మద్యం దుకాణాల ద్వారా ఎక్కువ అమ్మకాలు జరిగాయి. పల్నాడు జిల్లాలో రూ.93 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.86 కోట్ల మద్యం అమ్మకం జరిగింది. ఇక గుంటూరు జిల్లాలో రూ.115 కోట్లకుపైగా విలువ చేసే మద్యం విక్రయించారు. ఇందులో ఒక గుంటూరు నగరంలోనే రూ.50 కోట్ల మద్యాన్ని కేవలం దుకాణాల ద్వారానే కొనుగోలు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాల్లోనే రూ.34 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.16 కోట్ల అమ్మకాలు జరిగాయి. చిలకలూరిపేట ప్రాంతంలో అత్యధికంగా రూ.13 కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయి. అక్టోబరు 16కు ముందు జగన్ హయాంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండేవి. అప్పటి అమ్మకాలతో బేరీజు వేసుకుంటే ప్రస్తుతం ఇంచుమించు నెలకు రూ.20 కోట్ల అమ్మకాలు పెరిగాయి.

సరఫరాకు మించి రూ.99 మద్యానికి డిమాండ్

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా డిస్టలరీ కంపెనీలకు ఇచ్చిన ఆదేశాల మేరకు నాణ్యతతో కూడుకున్న చౌక మద్యం రూ.99కే అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో తొలుత ఈ మద్యం అందుబాటులో లేదు. అయితే కొద్ది రోజులు ఆలస్యంగానైనా సరే మార్కెట్లోకి రూ.99 మద్యం వచ్చింది. ఈ నేపథ్యంలో వీఎస్‌వోపీ వారి బ్రాందీ(ట్రోపికాన)కు డిమాండ్ విపరీతంగా ఉంది. ఇది డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రస్తుతానికి సరఫరా లేదు. త్వరలో ఈ బ్రాండ్లను కూడా భారీగా డంప్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

మద్దతు ధర కల్పించటానికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

కొల్లిపర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తూములూరు మర్రెడ్డి వారి కల్యాణ మండపంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ అధ్యక్షత జరిగిన సమావేశంలో నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 3.4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 45 క్లస్టర్స్ ద్వారా 156 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1740 ఇస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చేటప్పుడు 17 శాతం తేమ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. 17 శాతం కంటే తేమ ఎక్కువ ఉంటే తేమ శాతంను బట్టి ధాన్యానికి ధర నిర్ణయిస్తారని తెలిపారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమకానున్నట్లు చెప్పారు. మిల్లర్ల వద్ద ధాన్యానికి మంచి ధర వస్తే రైతులు అమ్ముకోవచ్చు అని తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్‌కలెక్టర్ సంజనాసింహ, సివిల్ సప్లయ్స్ అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. సర్పంచి అరుణాబాయ్, ఎంపీపీ భీమవరపు పద్మావతి, తహసీల్దార్ సిద్ధార్థ, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్స్ డీఎం శ్రీలక్ష్మి, జీడీసీఎమ్‌ఎస్ బ్రాంచి మేనేజర్ హరిగోపాల్, ఏడీఏ ఉషారాణి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటలపై ఆసక్తి ఉండాలి



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు ఆటలపై ఆసక్తి ఉండాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణసాగర్ తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న రెండో దశ అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు బుధవారంతో ముగిశాయి. కళాశాలలోని డాక్టర్ బీవీ.నాథ్ ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు సభకు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి అధ్యక్షత వహించగా డాక్టర్ కరుణసాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ త్వరలో జరగనున్న సదరన్ జోన్ క్రీడలకు సమయాత్తం కావాలన్నారు. గౌరవ అతిథి ఐటీసీ సీనియర్ మేనేజర్ వీవీఆర్ దీక్షిత్ మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహ పూర్వక వాతావరణం లభిస్తుందన్నారు. విద్యార్థుల క్రమశిక్షణ వలనే క్రీడా సాంస్కృతిక పోటీలు సమర్థవంతంగా నిర్వహించామని యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రవికాంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.వినయ్‌కుమార్, డాక్టర్ డీవీ సాయిరాం కుమార్ బహుమతుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్, డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, డాక్టర్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోటీలు

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఆటల పోటీలు ఈ నెల 17వ తేదీ నుంచి బాపట్ల వ్యవసాయ కళాశాలలో పోటాపోటీగా జరిగాయి. బుధవారం ముగింపు కార్యక్రమాన్ని డాక్టర్ బీవీ.నాథ్ ఆడిటోరియంలో నిర్వహించారు. బాలికల విభాగంలో బాపట్ల వ్యవసాయ కళాశాల, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, 400 మీటర్ల పరుగు, షార్ట్‌పుట్ పోటీల్లో విన్నర్స్‌గా, క్యారమ్స్‌లో రన్నర్స్‌గా ఉంటూ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. తెలుగు వ్యాసరచన, ఇంగ్లిష్ వక్తృత్వ, కవితల పోటీ, పోస్టర్ మేకింగ్ తదితర పోటీల్లో విన్నర్స్‌గా నిలిచి ఉత్తమ నటి అవార్డు సాధించి సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో గెలిచి మరో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవశం చేసుకున్నారు.

ఇళ్ల పట్టాల పేరుతో రూ.7 వేల కోట్ల దోపిడీ

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చిలకలూరిపేటలో ఇళ్ల స్థలాల కోసం జరిపిన భూ సేకరణలో భారీ అవినీతి జరిగిందని, ఈ స్కామ్‌లో మాజీ మంత్రి విడదల రజిని పాత్ర ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ పట్టణంలోని ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల కోసం జరిపిన భూసేకరణలో విడదల రజిని భారీ కుంభకోణానికి పాల్పడ్డారని, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆమె వల్ల నష్టపోయిన రైతులు గొడవ చేయటంతో విడదల రజిని కొంతమందికి తిరిగి డబ్బులు చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకున్నారని ఆరోపించారు. ఈ స్కామ్‌లో విడదల రజిని పాత్రను ఆధారాలతో నిరూపిస్తామని ప్రత్తిపాటి సవాల్ చేశారు. చిలకలూరిపేటలో జరిగిన విధంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పట్టాల పేరుతో జరిపిన భూసేకరణలో దాదాపు రూ.7 వేల కోట్ల దోపిడీ జరిగిందని ప్రత్తిపాటి తెలిపారు. నివాసానికి పనికిరాని ముంపు భూములను లక్షలు పెట్టి ప్రభుత్వం ద్వారా కొనిపించి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. జగన్ జమానాలో జరిగిన ఈ భారీ అవినీతిపై న్యాయ విచారణ జరిపించాలని, సీఐడీతో గాని, హౌస్ కమిటీతో గాని సమగ్ర విచారణ జరిపి, దీనివెనుక ఉన్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ప్రత్తిపాటి పుల్లారావు ప్రభుత్వాన్ని కోరారు.

రుణాల చెల్లింపు నగదు రూ.10 లక్షలు గోల్‌మాల్

పొన్నూరుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామంలో పొదుపు మహిళలకు సంబంధించి రుణాల చెల్లింపు నగదును యానిమేటర్ స్వాహా చేసిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామంలో ఓంకార్, శాంతి గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. ఓంకార్ గ్రామ సమాఖ్య యానిమేటర్‌గా పని చేస్తున్న అరుణ గత మార్చి నెలలో మృతి చెందారు. ఆ తరువాత మరో యానిమేటర్ ఈ ఓంకార్ గ్రామ సమాఖ్యకు సంబంధించి రుణ చెల్లింపుల పర్యవేక్షణ చేశారు. అయితే ఏపీఎం గానీ, సీసీలు గానీ ఇందుకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని సమాచారం. ఓంకార్ గ్రామ సమాఖ్యలో 27 పొదుపు సంఘాల్లో 300 మంది సభ్యులు ఉన్నారు. ఈ గ్రామ సమాఖ్యకు శ్రీనిధి రుణాలు, స్వర్ణ జయంతి గ్రామ స్వరాజ్ యోజన పథకం, ఉన్నతి పథకాల నుంచి సభ్యులకు రుణాలు మంజూరైయ్యాయి. రుణాలు పొందిన మహిళలు ప్రతి నెలా వాయిదాల నగదును గ్రామ సమాఖ్యకు చెల్లిస్తారు. అయితే ఈ నగదును యానిమేటర్, సీసీ ఇద్దరూ కలిసి వసూళ్లు చేశారని పొదుపు సంఘాల మహిళలు ఆరోపిస్తున్నారు. యానిమేటర్ అరుణ మృతి చెందిన తరువాత నాలుగు నెలల పాటు వేరొక గ్రామ యానిమేటర్ రుణాల నగదు చెల్లింపులను పర్యవేక్షించారు. ఈ కాలంలో సుమారు రూ.3.50 లక్షల నగదు గోల్‌మాల్ అయినట్లు సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై పొదుపు మహిళలు డ్వాక్ర ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఆరా తీసిన అధికారులకు మరికొన్ని అక్రమాలు తెలిసినట్లు సమాచారం. శాంతి గ్రామ సమాఖ్యలో కూడా రూ.6 లక్షల నగదు స్వాహా అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెలా పొదుపు మహిళలు చెల్లిస్తున్న రుణాలను బ్యాంక్‌లో జమ చేయకుండా యానిమేటర్ స్వాహా చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఆరోపణలపై ఏంపీఎం జోయబాబును వివరణ కోరగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓంకార్ గ్రామ సమాఖ్యలో అక్రమాలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

వీధి వ్యాపారులపై అధికారుల ఆంక్షలు తగదు



సరుకును రోడ్డుపై పోసి నిరసన తెలుపుతున్న చిరువ్యాపారులు

తెనాలి, మారీసుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తోపుడు బండ్లతో, బుట్టలతో పండ్లు, కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న తమపై మున్సిపల్ అధికారుల ఆంక్షలు తగవంటూ చిరువ్యాపారులు రోడ్డెక్కారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మార్కెట్ ప్రాంతంలో తోపుడు బండ్లు, బుట్టలతో వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులను మున్సిపల్ అధికారులు వ్యాపారం చేయవద్దంటూ ఆదేశించడంతో ఆందోళన చోటుచేసుకుంది. కూరగాయలు, పండ్లు రోడ్లపై పారబోసి చిరువ్యాపారులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ రోడ్లను ఆక్రమించుకుని పెద్దపెద్ద షాపులను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకునేవారు మున్సిపల్ అధికారులకు కన్పించడంలేదా అని ప్రశ్నించారు. తోపుడు బండ్లతో ఎవరికీ ఇబ్బంది లేకుండా చిరువ్యాపారాలు చేసే మాపైనే ఆంక్షలు విధించడం అన్యాయం అన్నారు. ఇదిలా ఉండగా, తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్లకు అడ్డంగా బండ్లను పెట్టి వ్యాపారం చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందనీ, ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ అధికారులు అంటున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

57,107 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 60,801 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 57,107 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 35,638 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	15000	334	8000	13000
నెంబరు. 5	8000	12500	నెంబరు. 5	8500	8500
273	9000	12000	273	10800	12000
341	8000	15000	341	8500	14000
4884	10000	12500	4884	9500	14500
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16800	తేజ	8000	16500
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	9000	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	5000	10000

రాష్ట్ర స్థాయి కవితల పోటీలకు ఆహ్వానం

బాపట్ల, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సాహితి భారతి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కవితల పోటీలు నిర్వహిస్తున్నామని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ తెలిపారు. ఇతి వృత్తం ఏదైనా అరఠావు మించకుండా తమ కవితలను రాసి హామీ పత్రంతో జతపరిచి పంపాలన్నారు. డిసెంబరు 10వ తేదీలోగా తమ కవితల ను ఆదం షఫి, రచయిత, కోశాధికారి సాహితి భారతి, జమేదారుపేట, బాపట్ల, పిన్ 522101 అను చిరునామాకు పంపాలన్నారు. కవితల పోటీల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు జనవరి 25వ తేదీన జరిగే సభలో అందజేయబడతాయని తెలిపారు.

విస్తరణా శిక్షణకేంద్రం ప్రిన్సిపాల్‌గా వెంకట్రావు

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్‌గా దేవరకొండ వెంకట్రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుకు సంబంధించిన పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులతో శిక్షణ ఇచ్చే ప్రాంతీయ శిక్షణా కేంద్రంగా ఇది ఉంటుంది.

కొండుభొట్లపాలెంలో జంగిల్ క్లియరెన్స్

బాపట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామంలో బుధవారం జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్ల పక్కనే పిచ్చిమొక్కలు, ముళ్ళచెట్లు తొలిగించి కలుపునివారణ మందు పిచికారి చేయించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లంసరోజినీ జీవన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండలు, జి.వెంకటేష్, లూదియా, జయమ్మ, సురేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రక్తపరీక్షలు

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో పని చేసే పారిశుధ్య కార్మికుల బ్లడ్ గ్రూప్ పరీక్షలు బుధవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆధ్వర్యంలో 62 మంది కార్మికులకు పరీక్షలు నిర్వహించి బ్లడ్ గ్రూప్ తెలియజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్‌ఐ

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పట్టణ ఎస్‌ఐ సీహెచ్ చంద్రావతి తెలిపారు. పట్టణంలోని అక్బర్‌పేట, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఐ చంద్రావతి మాట్లాడుతూ పిల్లలు ఆపదలో ఉంటే తప్పనిసరిగా 1098 లేదా 100 నెంబర్‌కు కాల్ చేస్తే రక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో పురుషోత్తమరావు, బాలల సంరక్షణాధికారి జి.కృష్ణ, సూపర్‌వైజర్ జి.జ్యోతి, ప్రిన్సిపాల్ భవానీదేవి, వైస్ ప్రిన్సిపాల్ లూర్దుమేరి, బాలసదన్ సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మి, రోజ్‌లినా, వినోద్, రవి, రతిదేవి, రాము, సులోచన పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లెళ్ళమూడిలో శ్రీలలిత కోటి పారాయణం

బాపట్ల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి హైమావతిదేవి 82వ జయంతి సందర్భంగా అమ్మసన్నిధిలో శ్రీలలిత కోటి పారాయణం గురువారం ఉదయం 7 గంటలు నుంచి నిర్వహించటం జరుగుతుందని శ్రీ విశ్వజననీ పరిషత్ ట్రస్ట్ కార్యనిర్వాహణాధికారి జేఎల్‌పీ సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోటి నామ పారాయణ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేసి అమ్మప్రసాదం స్వీకరించి శ్రీలలిత దేవి కృపకు పాత్రులుకావాలని తెలిపారు.

రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

బాపట్లరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్య ఘర్ యోజన పథకం కింద లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ వేగవంతం చేయా లని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జి.ఆంజనేయులు అన్నారు. సంబంధితాధికారులకు బుధవారం పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 1599 విద్యుత్ వినియోగదారులు తమ గృహ అవసరాల కోసం అప్లికేషన్స్ పెట్టుకున్నారని, అందులో 202 మంది మాత్రమే సోలార్ పథకాలను బిగించుకున్నారని తెలిపారు. బాపట్ల డీఈ శ్రీనివాసరావు, ఏఈలు పాల్గొన్నారు.

26న ధర్నా జయప్రదం చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా వ్యవహరిస్తుందని ఏఐటీయూసీ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కార్యదర్శి జి.సుధాకర్ ఆరోపించారు. భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వర్గాలకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న విధానాలను నిరశిస్తూ ఈనెల 26న కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘ నాయకులు జి.బాలాజీ, మురుగుడు సత్యనారాయణ, కొడాలి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చండూరు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో గొంతు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌కు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వేటపాలెం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ పోటీ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించి నివారించడానికి ప్రభుత్వం ఈనెల 14 నుంచి ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామాల్లో ఈ పరీక్షలు చేపట్టిందన్నారు. జిల్లా వైద్యాధికారులు ఈ పరీక్షల ద్వారా ఎవరికైనా క్యాన్సర్ సోకిందని నిర్ధారిస్తే ప్రభుత్వం ఉచితంగానే వైద్య చికిత్సలు, మందులు అందించడం జరుగుతుందన్నారు. ఈఎన్‌సిడి 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది పుష్పలత, విజయకుమారి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని కమ్యూనిటీ హాళ్లు

● టీడీపీ నేతపై వైసీపీ కక్ష సాధింపు చర్య ● నిర్మాణం పనులు తుది దశలో ఉండగా టెండర్లు రద్దు ● బిల్లును నిలిపివేసిన వైనం

వేమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబుపై వైసీపీ కక్ష సాధింపు చర్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2018 ఆగస్టులో వేమూరు దళితవాడలో రెండు కమ్యూనిటీ హాలుల నిర్మాణం నిమిత్తంగా టెండర్ ద్వారా విజయబాబు రూ.70 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. 2019 ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సమయానికి రెండు కమ్యూనిటీ హాలుల దాదాపు నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే విజయబాబుకు లెంటల్ లెవల్ వరకు బిల్లు రూ.20 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వం రావడంతో టీడీపీ నేత నిర్మాణాలు చేపట్టాడన్న అక్కసుతో నిర్మాణాలు చివరి దశ వరకు పూర్తి చేసినప్పటికీ సంబంధిత టెండర్ రద్దు చేశారు. దీంతో ఆయనకు చెందాల్సిన రూ.50 లక్షలకు పైగా బిల్లులు నిలిచిపోయాయి. విద్యుత్ సౌకర్యం, పెయింట్స్ వేసేందుకు వైసీపీ ప్రభుత్వం తిరిగి మరో టెండర్ పిలవడం జరిగింది. రెండవ టెండర్ ద్వారా పనులు పూర్తిగా ఆ టెండర్లోనే మంజూరై నిధులు దారి మళ్లించినట్లుగా తెలుస్తోంది. దళితవాడలో రెండు ప్రాంతాల్లో జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల పేరు మీదుగా ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసి కమ్యూనిటీ హాల్స్ కోసం నాటి మంత్రిగా పని చేసిన నేటి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రత్యేక శ్రద్ధ చూపారు. అలాంటిది వైసీపీ ప్రభుత్వం ప్రజా సౌకర్యాలను కూడా గుర్తించకుండా పార్టీ కక్షతో వాటి నిర్మాణాలను అడ్డుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. వైసీపీ తీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు. పెట్టుబడి పెట్టిన విజయబాబుకు సంబంధించిన నిధులు ఒక్క రూపాయి కూడా విడుదల కాకుండా ఉండే విధంగా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించడంపై తీవ్రంగా విమర్శలు వినవస్తున్నాయి. ఈ నిర్మాణాలపై కూటమి ప్రభుత్వ నాయకులు విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వేమూరు దళితవాడలో నిర్మాణం పనులు పూర్తి కాకుండా ఉన్న కమ్యూనిటీ హాలు భవనం

పాఠశాల నిర్వహణ సరిగా ఉండాలి

● ఉపాధ్యాయులకు కలెక్టర్ జె.వెంకటమురళి సూచన



బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు



కావూరు పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న జిల్లా కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, రేపల్లె, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల నిర్వాహణ సరిగా ఉండాలని, విద్యార్థులు చక్కగా చదువుకునే అవకాశాలు కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్, చెరుకుపల్లి మండలంలోని చెరుకుపల్లి, గుళ్ళపల్లి, కావూరులోని ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలోని పరిసరాలను పరిశీలించిన ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులలో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, హాజరైనవారి సంఖ్య, ఆటస్థలాన్ని పరిశీలించారు. కొత్తగా నిర్మాణం చేపట్టిన భవనం త్వరగా పూర్తి చేయటానికి గుత్తేదారుడికి ఆదేశాలివ్వాలని సూచించారు. చెరుకుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మీ నారాయణను ఆ పాఠశాలకు సంబంధించిన టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ వివరాలు, పేరెంట్‌మీటింగ్ నిర్వాహణ, క్రీడా ప్రాంగణం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రహరీ పునర్ నిర్మాణానికి తీసుకున్న చర్యలు, టాయిలెట్ల పరిశీలన వాటి నిర్వాహణ, మధ్యాహ్నభోజనానికి సంబంధించిన వంట గదిని పరిశీలించారు. అదేవిధంగా చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నిర్వాహణపై ఆరా తీశారు. కావూరు ఉన్నత పాఠశాలను సందర్శించి తల్లిదండ్రుల సమావేశాల నిర్వహణపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీవో ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు, బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, బాపట్ల ఆర్‌డివో పి.గ్లోరియా, బాపట్ల తహసీల్దార్ షేక్ సలీమా, ఇన్‌చార్జ్ ఆర్డివో చంద్రశేఖర్‌నాయుడు, పీపీవో ప్రభాకరరావు, ఎంఈవో లాజర్, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో సుభాని పాల్గొన్నారు.

పారదర్శకంగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీ : కలెక్టర్

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా ఇంటర్వ్యూలు బుధవారం కలెక్టరేట్‌లో జరిగాయి. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఇంటర్వ్యూలకు 109 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగాలకు ముగ్గురు హాజరు కాగా, 44 ఆయాల ఉద్యోగాలకు 106 మంది హాజరయ్యారు. వారిని అధికారులతో కలిసి కలెక్టర్ ఇంటర్వ్యూలు చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమా, ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, సీడీపీవో లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న కమిషనర్ రఘునాధరెడ్డి తదితరులు

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని విజ్ఞాన విలువలు పెంపొందించుకోవాలని కమిషనర్ జి.రఘునాధరెడ్డి తెలిపారు. బాపట్ల శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం గ్రంథాలయాధికారి ఎ.శివాజి గణేశన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎవివి ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.సత్యవతి, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, వంకాయలపాటి హరిబాబు, సీహెచ్ భవానీదేవి, జి.వెంకటేశ్వర్లు, ఎ.మల్లికార్జునరావు పాల్గొన్నారు. మండలంలోని అప్పికట్ల గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందినవారికి బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామపెద్దలు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● బాపట్ల రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : పూండ్ల గ్రామంలో పూండ్ల శాఖా గ్రంథాలయ ఆధ్వర్యంలో వారోత్సవాలు ముగిశాయని గ్రంథాలయాధికారి ఎస్.ప్రకాశరావు తెలిపారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి ప్రధానోపాధ్యాయుడు బోయనరాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఎస్‌కే బాషా, గంగిశెట్టి రత్తయ్య, అశ్విన్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా బుధవారం గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ ఛైర్మన్ ఎం.సుబ్బారెడ్డి విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎంఈవో-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావును గ్రంథాలయ ఛైర్మన్ ఎం.సుబ్బారెడ్డి, గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు, బాపట్ల ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు, గ్రంథాలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మండలంలోని ఖాజీపాలెం, మంతెనవారిపాలెం, చందోలు శాఖా గ్రంథాలయాలలో గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయా గ్రంథాలయాధికారుల ఆధ్వ ర్యంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

● కర్లపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల వారోత్సవాల సభలో ఎంపీ డీవో శ్రీనివాసరావు ముఖ్య అతిథిగాపాల్గొని పలు పోటీలలో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సునీత, ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్, ఇంకొల్లు పోలీసురావు, కంకిపాటి హైమావతి, పెనుమెత్స బాపిరాజు, చిట్టిరాజు, బుర్ల వెంకటేశ్వర్లు, నాగరాజు, గ్రంథాలయాధికారి టివి రమణమ్మ పాల్గొన్నారు.

● వేమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వేమూరు శాఖ గ్రంథాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషోర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో రిటైర్డ్ సూపరింటెండెంట్ వెంకట్రామయ్య, పంచాయతీ శానిటరీ సెక్రటరీ చంద్రపాల్, దివ్యాంగుల వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు దాసరి బసవయ్య, చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ సభ్యురాలు కొండా కీర్తన, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ప్రకాష్, కంచర్ల శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలుతో పాటు కొల్లూరు, అనంతవరం శాఖా గ్రంథాలయాల్లో వారం రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతి ప్రదానాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో ఎం.దేవరాజు, హెచ్‌ఎం హవీలా ప్రశాంతి, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, ఉప సర్పంచ్ దూళిపూడి కృష్ణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయ, ఉపాధ్యాయురాలు నిర్మలాదేవి, గ్రంథాలయ అధికారులు సుభాష్‌చంద్రబోస్, వై.రాంబాబు, జి.కనకదుర్గ పాల్గొన్నారు.

● చుండూరు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో యడ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ శ్రీనిధి పాల్గొని వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రమేష్, గ్రంథాలయ అధికారి గిరిజా సుందరి పాల్గొన్నారు. వలివేరు గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ దాట్ల సౌజన్య, చుండూరు గ్రంథాలయంలో మాజీ మండల అధ్యక్షుడు బి.శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు బహుమతులు అందించారు. వేటపాలెం, మోదుకూరు, గ్రంథాలయాల్లో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

● నగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనం ద్వారానే విజ్ఞానంతో పాటు సమాజంపై అవగాహన కలుగుతుందని మాజీ జడ్పీటీసీ మేకా శివరామకృష్ణ అన్నారు. మండలంలోని మంత్రిపాలెంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. పుస్తక ప్రదర్శనను సందర్శించి విద్యార్థులకు గ్రంథాలయాల విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.ప్రమీల, మాజీ సర్పంచ్ ఆర్.విజయలక్ష్మి, గ్రంథాలయ నిర్వాహకులు జొన్నా బ్రహ్మేంద్ర, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి : డీఆర్‌డీఏ పీడీ

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోపాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయిలో ఎస్‌ఇఆర్‌పి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరియా కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రాజెక్ట్‌మేనేజర్‌లు, కమ్యూనిటి కోఆర్డినేటర్లకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి పీడీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మరుగుదొడ్లు ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అండ్ న్యూట్రీషన్ యాంకర్ పర్సన్ డి.శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనర్ మస్తాన్, శ్రీనివాసరెడ్డి, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

అపార్ ఐడీతో ఆధార్‌లోని తప్పు, ఒప్పులు సరిచేయవచ్చు

● మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు

పిట్టలవానిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అపార్ ఐడీ ద్వారా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఆధార్ కార్డులో ఉన్న వారి తప్పు, ఒప్పులను సరిచేయటం జరుగుతుందని పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని చందోలు, పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం, ఖాజీపాలెం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో అపార్ ఐడి ద్వారా ఇప్పటి వరకు సుమారు 500 మంది విద్యార్థులకు ఈ ప్రక్రియను నిర్వహించటం జరిగిందని తెలిపారు.

పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి : సూపర్‌వైజర్

బాపట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంటా జ్యోతి తెలిపారు. మండలంలోని మహాత్మాజీపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్లాక్ కో ఆర్డినేటర్ బి.రత్నకిరీటితో కలిసి అన్నప్రాసన చేసి బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలియజేశారు. అదేవిధంగా సుబ్బారెడ్డిపాలెంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. ఆయా కార్యక్రమాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్

రేపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, ఛైర్‌పర్సన్ కట్టా మంగకు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ జీవోఎంఎస్‌నెంబరు 36ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు చెల్లించాలని, ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు, కార్యదర్శి ఎస్.రవిబాబు, రాఘవేంద్రావు, రమేష్, శివ, శ్రీనివాస్, యువరాజ్, రవి పాల్గొన్నారు.

24న జాతీయ ప్రతిభా అన్వేషణ నమూనా పరీక్షలు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభా అన్వేషణ నమూనా పరీక్ష ఈనెల 24న జరగనున్నట్లు ఏపీఎస్‌ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని వెల్లటూరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్ ఫోరం తరపున విజయనగరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నమూనా ప్రశ్నాపత్రం, కీని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్రంలోని విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

పెరవలిలో పూరిపాక దగ్ధం

వేమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు దండే శ్రీనివాసరావుకు చెందిన పూరిపాకను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. పాకలో ఉన్న 3 హెచ్‌పి మోటార్లు రెండు, ఒక ఆయిల్ ఇంజన్ పూర్తిగా కాలిపోయాయి. పాకతో పాటు వాటిలో ఉన్న వస్తువుల విలువ రూ.లక్షా 50 వేల దాకా ఉంటుందని బాధితులు తెలిపారు. రాజకీయ ప్రత్యర్థుల దుశ్చర్యగా బాధితుడు భావించి, వేమూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రవికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

పర్యాటక కేంద్రం అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రెండు తెలుగురాష్ట్రాలకు అత్యంత దగ్గరగా ఉన్న సూర్యలంక పర్యాటక కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలలో బుధవారం తొలిసారిగా మాట్లాడిన ఎమ్మెల్యే వేగేశన పర్యాటక రంగ అభివృద్ధిపై వివరించారు. బాపట్ల తీరం నుంచి చీరాల సముద్రతీరం వరకు బ్రిటీష్‌కాలంలో 80 అడుగుల వెడల్పు గల రాజదండు రోడ్డును ఏర్పాటు చేశారన్నారు. ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ మీద వంతెన అభివృద్ధి చేసి ఈ రెండు ప్రాంతాలను కలుపుతూ రోడ్డు నిర్మిస్తే పర్యాటక కేంద్రాలు అత్యంత ఆహ్లాదకరంగా ఉంటాయన్నారు. సుమారు 14 నుంచి 15 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రోడ్డు అభివృద్ధి చేయాలని ఇప్పటికే ఈప్రాంతంలో 4 నుంచి 5 ఫైవ్ స్టార్ హోటళ్ళు వస్తున్నాయన్నారు. హైదరాబాద్ నుంచి నార్కెట్‌పల్లి మీదుగా పర్చూరు, నరసరావుపేట, చీరాల కలుపుతూ నిర్మిస్తున్న రోడ్డు ఏడాదిలో పూర్తవుతుందన్నారు. దీనివల్ల పర్యాటకులు హైదరాబాద్ నుంచి కేవలం 4 గంటల సమయంలో వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. దీని కోసం సరైన వసతులు కల్పించే దిశగా టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. కేంద్రప్రభుత్వం శ్రీశైలం, బాపట్ల, సంగమేశ్వరం, గోదావరి బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు 4 నుంచి 5 వేల కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే నరేంద్రవర్మ అసెంబ్లీలో వివరించారు.

బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి : నరేంద్రవర్మ

బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉంటుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యం పొందలేని వారికి సాయం అందిస్తున్నట్లు వివరించారు. పట్టణంలోని రైలుపేటకు చెందిన పోతనరాజ్యలక్ష్మీ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షల చెక్కును బాధితులకు ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ వైద్యం అందిస్తుందని మెరుగైన చికిత్స నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన వారు చెల్లించిన నగదు రశీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించి క్షతగాత్రులకు ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు.



వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మోపిదేవి వెంకటరమణారావు

వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన మోపిదేవి

రేపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మండలంలోని జొన్నావారిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు మరణించారు. ఆయన కుటుంబాన్ని బుధవారం మాజీమంత్రి, టీడీపీ నాయకుడు మోపిదేవి వెంకటరమణారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబసభ్యులు ఎవరూ అధైర్యపడవద్దని అండగా ఉంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజుకాల్వ సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు హైవెండ్ విద్యార్థి దీప్తి అంజని ప్రియ ఎంపిక

కర్లపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్‌లో 7వ తరగతి విద్యార్థిని అగ్నిహోత్రం దీప్తి అంజనిప్రియ 27వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైందని పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ బొడ్డు సాయిమహేంద్రబాబు తెలిపారు. ఒంగోలులోని సిద్దార్ధ భవన్‌లో ఈనెల 17న జరిగిన ఆంధ్రప్రదేశ్ 22వ తైక్వాండో పోటీలలో పాల్గొని సిల్వర్ మెడల్ కైవశం చేసుకొని జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైందన్నారు. డిసెంబరు 14, 15 తేదీలలో ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే 27వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో దీప్తిఅంజనప్రియ పాల్గొంటుందని ఆయన వివరించారు. పాఠశాల ప్రాంగణంలో బుధవారం దీప్తిఅంజనప్రియకు అభినందనసభ ఏర్పాటు చేశారు. తైక్వాండో పోటీలలో సాధించిన మెడల్స్‌ను ఎండి సాయిమహేంద్రబాబు, తాతయ్య అగ్రిహోత్రం అప్పలచార్యులు బహూకరించారు. దీప్తిఅంజనప్రియ, బాపట్ల జిల్లా తైక్వాండో కరాటే అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావులను ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మెండు మహేంద్రభాస్కరరావు, హైవెండ్ ఛైర్మన్ పెదమల్లు ఉదయచంద్రరావు, డైరెక్టర్‌లు మేరువ ఆంజనేయప్రసాద్, చాందిని, వెంకటజ్యోతి అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే సహకోచ్ శివసేనరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.బాబురావు, సిరాజుఆలీఖాన్, మారుతీప్రసాద్, అప్పలచార్యులు, శ్రీరామకుమార్, శ్రీలక్ష్మీ, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, రామలక్ష్మి, షర్మిలబేగం, రఫీ, లక్ష్మీప్రసన్న, అనిత, అనూష, హిమబిందు, జెరీనా, రమణ తదితరులు పాల్గొన్నారు.



అంజని ప్రియకు కాంస్య పతకాన్ని బహూకరిస్తున్న ఎండి సాయిమహేంద్రబాబు, కరాటే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ప్రొఫెసర్ వట్టిప్రోలు అరుణకుమారి

వేమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి సన్మార్గంలో నడిపేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ప్రొఫెసర్ వట్టిప్రోలు అరుణకుమారి అన్నారు. వేమూరులో జీసస్ యంగ్ ఆర్మీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో యువతీ, యువకులు డ్రగ్స్, స్మోకింగ్ అనే అలవాటులకు బానిసలై ఉన్నత విద్యావంతులు కాలేకపోతున్నారన్నారు. విద్యతోనే పేదరికం నుంచి విముక్తి కలుగుతుందని, విద్యావంతులైన వారు సమాజ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసస్ యంగ్ ఆర్మీ మినిస్ట్రీస్ డైరెక్టర్ రాజు, అబ్రహం, తిమోతి, సంఘస్తులు, పాస్టర్లు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దు : ఏవో



వరి మద్దతు ధర బ్రోచర్లు ప్రదర్శిస్తున్న ఏవో, రైతులు

కొల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి రైతులు నష్టపోవద్దని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొల్లూరులో పలు చోట్ల వరి మద్దతు ధర బ్రోచర్లను రైతులతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దళారులు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని గ్రహించి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టిందన్నారు. ఈనెల 23న అల్పపీడనం ఏర్పడబోతున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారన్నారు. రైతు లు 21వ తేదీ వరకు వరి కోతలు యంత్రాల ద్వారా మాత్రమే కోయించుకోవాలన్నారు. 23వ తేది నుంచి వారం రోజుల పాటు కోతలను వాయిదా వేసుకోవాలని, శాస్త్రీయ పద్ధతిలో వరి కోతలు కోసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, అభ్యుదయ రైతులు తదితులు పాల్గొన్నారు.



మత్స్య విలాపం!

- కాలుష్య కోరలతో అంతరించిపోతున్న విశిష్ట మత్స్యజాతులు
- ఎగుమతుల్లోనూ వెనకడుగే
- వైసీపీ పాలనలో మత్స్యకారులపై నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంలో గంగపుత్రుల సంక్షేమం

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం





సముద్రంలో ఉండే విశిష్ట మత్స్య సంపద కాలుష్యం దెబ్బకు అంతరించి పోయే ముప్పును ఎదర్కొంటోంది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలవడానికి తోడు పారిశ్రామిక వ్యర్థా లకు కూడా సముద్రమే అంతిమ మజిలీ కావడంతో ఎన్నోరకాల మత్స్యజాతులు అరుదైన జాతి కోవలోకి చేరిపోయాయి. ఈ క్రమంలో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలను పట్టించుకునే వారే కరువయ్యారు. గడచిన ఐదేళ్లలో ఈ విచ్చలవిడి తనం పతాకస్థాయికి చేరుకోవడంతో మొత్తం మత్స్య రంగమే ప్రమాదంలో పడే విలపించే స్థితికి చేరుకుంది. ఇక, మత్స్యకారుల గురించి చెప్పాలంటే సముద్రంలో చేపల వేటే వారి వృత్తి. నెలలో ఇరవై రోజులు గంగమ్మతోటే వారి ప్రయాణం. ఆటుపోట్లు, గంగమ్మ ఉరకలు, తుఫాన్ హెచ్చరికలు ఇవేవీ కడలితో వారికి ఉన్న బంధాన్ని తెంచలేవు. రెక్కలు ముక్కలయ్యేలా కష్టపడుతున్నా వారి జీవనప్రమాణాలు మాత్రం మెరుగుపడడం లేదు. గురువారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారులతో పాటు ఆ రంగం ఎదుర్కొంటున్న అనేక ఆటుపోట్లపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చేపల వేటపై ఆధారపడి బతుకుతున్న వారు దాదాపు 50,000 మంది వరకు ఉంటారు. కానీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం ఈ సంఖ్య 20,000 ఉండటం గమనార్హం. ముఖ్యంగా చీరాల, చినగంజాం, రేపల్లె, బాపట్ల తీర ప్రాంతాల్లో మత్స్యకారులు ఎక్కువగా ఉంటారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క కార్యక్రమం కూడా మత్స్యకారుల కోసం చేపట్టక పోవడం గమనార్హం. ప్రతి ఏటా చేపల వేట నిలుపుదల చేసే రెండు నెలల కాలానికి మాత్రం అరకొరగా మత్స్యకార భరోసా పథకం కింద జమ చేసి 'మమ' అనిపించింది. జిల్లా వ్యాప్తంగా 'భరోసా'కు అర్హులైన వారే దాదాపు 25,000 మంది వరకు ఉండగా, 12,000 మంది ఖాతాల్లో మాత్రమే జమ చేసి గంగపుత్రులకు అన్యాయం చేసిన ఘనత వైసీపీది.

పురోగమింప చేయడానికి తీసుకోవాల్సినవి

చేపల పెంపకానికి అనువైన చెరువులను గుర్తించే ప్రక్రియ 2014-19 మధ్య ముమ్మరంగా జరి గింది. కానీ తర్వాత గద్దెనెక్కిన వారు పట్టించుకోవడమే మానేశారు. ప్రస్తుతం వాటిని గుర్తించ డంతో పాటు నీటి వనరులను కూడా కల్పించడం కూటమి ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యం. మత్స్యకార సొసైటీలను అన్ని విధాలుగా గత ప్రభుత్వం కుదేలు చేసింది. ఇప్పటికే సొసైటీలకు ఎన్నికలు జరిపే ప్రక్రియను కూటమి ప్రభుత్వం చేపట్టింది. సహకార సంఘాలకు పూర్వ వైభవం దక్కే విధంగా ప్రభుత్వం వైపు నుంచి చేయూత అందించి నిలదొక్కుకునే అవకాశం కల్పించడం ప్రాధాన్యంగా చేయాల్సి ఉంది.

ఎగుమతులపై దృష్టి పెట్టాలి

గడచిన ఐదేళ్లలో ఎగుమతులలో జిల్లా వాటా పడిపోతూ వస్తోంది. 86 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం ఉన్న జిల్లాలో దాదాపు 3,000 వరకు వేట పడవలు ఉన్నాయి. ఏటా 850 టన్నుల వరకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఇక్కడ నుంచి ఎగుమతి చేసేవారు. కానీ గడచిన ఐదేళ్లలో అవలంబించిన అస్తవ్యస్త విధానాలతో ఇది కాస్తా 600 టన్నులకు పరిమితమైనట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. సముద్రంలో చేపల సంఖ్య భారీగా తగ్గడంతో గిట్టుబాటు కావడం లేదని మత్స్యకారులు వాపోతున్న ఉదంతాలు కోకొల్లలు. ప్రస్తుతం కేంద్రం నుంచి కూడా సహకారం అందుతుండడం వల్ల వీలైనన్ని చేపల అనుబంధ ప్రాజెక్టులను జిల్లాకు తీసుకురావడంలో ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

'హామీ' నిలబెట్టుకుని భరోసా పెంచాలి

ఎస్. అనిల్ కుమార్, జిల్లా ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీస్ వైస్ చైర్మన్



వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ. 20,000 కు పెంచుతామని ఎన్నికలకు ముందు చెప్పినట్లుగానే అమలు చేయాలి. గత ప్రభుత్వంలో అర్హులైన చాలా మంది మత్స్యకారులకు 'భరోసా' విషయంలో న్యాయం జరగలేదు. ఇప్పుడు అందరికీ పరిహారం అందేటట్లు చూడాలి. సొసైటీలను బలోపేతం చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలి.

వ్యర్థాలు సముద్రంలో కలవకుండా చూడాలి

సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు వాటి వ్యర్థాలను సముద్రంలో కలపడం ద్వారా పెద్ద ఎత్తున మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతోంది. మత్స్య సంపదకే కేంద్రంగా ఉండే నదులు, వాగులు, చెరువులను కాలుష్యం ఓ వైపు కమ్మేస్తుంటే, మరో వైపు ఆక్రమణలు శాపంగా మారాయి. నాలుగేళ్ల కిందట కేంద్రం ప్రారంభిం చిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన జిల్లాలో అమలైన దాఖలాలే కనిపించలేదు. ఈ పథకం కింద మత్స్యసంపదను పెంచేవిధంగా కార్యాచరణ రూపొందిం చడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ముం దుకెళ్లడం దీనిలోని ప్రధాన అంశం. కానీ ఆ దిశగా రాష్ట్రం చొరవ తీసుకోకపోవడంతో ఆ నిధులు కూడా నిరుప యోగమైనట్లు సమాచారం.

వాతావరణ మార్పులతో ఒడిదుడుకులు

ఇక వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులు కూడా మత్స్యరంగం ఒడిదుడుకులకు కారణంగా ఉంది. కొవిడ్ తర్వాత ఎగుమతులపై ఆంక్షలు పెరగడంతో పాటు నాణ్యత విషయం లోనూ కఠినమైన ఆంక్షలను అంతర్జాతీయంగా ఎదుర్కోవాల్సి రావడం కూడా ఈ రంగానికి గొడ్డలి పెట్టులా తయారైంది. మత్స్యకారుల సంక్షేమమే తొలి ప్రాధాన్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది. కడలిని వ్యర్థాలకు ఆవాసాలుగా మారకుండా చూసి మత్స్య సంపదను కాపా డాల్సిన గురుతర బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఐదేళ్ల బాలారిష్టాలకు స్వస్తి చెబుతూ భవిష్యత్తులో మత్స్యరం గాన్ని పురోగమన బాట పట్టించే విధంగా ప్రపంచ మత్స్య దినోత్సవం రోజు పాలకులు ప్రతినబూని అందుకు తగ్గ కార్యాచరణ రూపొందిం చాల్సిన అవసరం ఉంది.

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఇదికూడా జరుగుతోంది. ఆ జాబితా పరిశాలన కూడా ఏకకాలంలోనే జరుగుతోంది. ఇది కాక ప్రతి సంవత్సరం కొత్త ఓట్ల చేరికలకు సంబంధించి 2025 జనవరి 5 నాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పూర్తిచేసేలా స్పెషల్ సమ్మరీ రివిజన్ కూడా జరుగుతోంది. వీటన్నిటికీ వీఆర్‌ఓలు బీఎల్‌ఓ హోదాలో హాజరు కావలసిందే. ఎన్నికల విధుల్లో బీఎల్‌ఓలుగా ఆయా గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో వీఆర్‌ఓలనే నియమిస్తారు. వారు చాలకుంటే ఇతర శాఖల సిబ్బందిని కూడా బీఎల్‌ఓలుగా తీసుకునే అధికారం ఉండటంతో ఇతర సిబ్బందినికూడా దీనికి ఉపయోగిస్తున్నారు. ఇదిట్లా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం హౌస్‌హోల్డ్ సర్వే చేపట్టింది. దీనికి ఇప్పటికే సచివాలయ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. అయితే సర్వే వేగవంతం కావటంలేదనే వత్తిడి కూడా ప్రభుత్వం నుంచి వస్తుండటంతో చాలా మండలాల్లో ఎంపీడీఓలు సచివాలయ సిబ్బందినే కాకుండా వీఆర్‌ఓలను కూడా సర్వే విధులకు పంపుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ సమన్వయంతో ఉన్న మండలాల్లో వీరి సమస్య పెద్దగా లేకు న్నా, కొన్నిమండలాల్లో మాత్రం అగ్గి రాజుకుంటోంది.

అడకత్తెరలో.. వీఆర్వోలు

వైసీపీ సర్కారు పెట్టిన చిచ్చుతో...

గతంలో రెవెన్యూ శాఖ కింద పనిచేసే సిబ్బంది మొత్తానికి వేతనాలు సిద్ధంచేసి పంపే అధికారం ఆయా మండలాల తహసీల్దార్‌లకే ఉండేది. అయితే వైసీపీ సర్కారు వచ్చాక దీనిలో తీవ్ర గందరగోళ పరిస్థితిని తీసుకొచ్చింది. వీఆర్‌ఓల వేతనాలు వేసే అధికారం ఎంపీడీఓలకు అప్పగించారు. అయితే ఇక్కడా మరో మెలిక ఉంది. వీఆర్‌ఓలలో గ్రేడ్-1, గ్రేడ్-2 అనే రెండు కేటగిరీలు చేశారు. పాత కాలం నుంచి ఉన్న వీఆర్‌ఓలను గ్రేడ్-1 కింద ఉంచి, వారికి జీతం తహసీల్దార్ పరిధిలోనే ఇచ్చేలా పాత పద్ధతినే ఉంచేస్తే, వీఆర్‌ఏలు, ఇతర శాఖల నుంచి ప్రమోషన్‌పై వచ్చిన వీఆర్‌ఓలను గ్రేడ్-2 కింద కేటాయించారు. వీరికి మాత్రం తహసీల్దార్ కాకుండా ఎంపీడీఓలు వేతనాలు వెయ్యాల్సి ఉంటుంది. అటు సచివాలయంలోనూ విలేజ్ రెవెన్యూ సెక్రటరీలు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరికీ ఎంపీడీఓలే వేతన బిల్లులు పంపాల్సి ఉంటుంది. గ్రేడ్-2 కింద ఉన్నవారు కూడా రెవెన్యూ కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే తాజాగా పెరిగిన పని వత్తిడి కారణంగా ఎవరికివారు మా సిబ్బందంటే మా సిబ్బందంటూ వారికి విధులు అప్పగించేస్తున్నారు. అయితే రెండు చోట్ల విధులకు హాజరు కాలేక సతమతమవటం వీఆర్‌ఓల వంతవుతోంది. ఈ తరహా అనాలోచిత మార్పులు చేసిన వైసీపీ సర్కారు నిర్ణయాల కారణంగా ఇప్పుడు శాఖల మధ్యే సమన్వయం లోపించటానికి, వారి మధ్య వివాదాలకు కారణమవుతోంది. తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని, పెదనందిపాడు, అటు బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మరికొన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఈ వ్యవహారం తారాస్థాయికి చేరితే, మరికొన్నిచోట్ల సర్దుకుపోతూ, పని వత్తిడి వచ్చినప్పుడు బయటపడుతూ వస్తున్నారు. తెనాలి, మరికొన్నిచోట్ల వీఆర్‌ఓలపై తహసీల్దార్‌లు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పరిశీలనా విధులకు రావాలని తెగేసి చెబుతుంటే, ఎంపీడీఓలు తాము చెప్పిన విధులకు రాకుంటే మెమోలే జారీ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని వీఆర్‌ఓలు ఆరోపిస్తున్నారు. తెనాలిలో ఇప్పటికే ముగ్గురుకి మెమోలు ఇస్తే, ఒకరి వేతనం ఆపుతామని బెదిరించారని, నెలనెలా వచ్చే జీతంతో బతికేవారిపై ఇటువంటి బెదిరింపులకు దిగితే ఎట్లాగంటూ వారూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వీఆర్‌ఓల సంఘంలో ఈ వివాదాన్ని పెట్టి తేల్చుకుంటామంటూ వారూ తగ్గకుండా హెచ్చరికలు చేయటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ఇదిట్లాఉంటే గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాల వీఆర్‌ఓలు మాత్రం ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళితే, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కలెక్టర్‌కు విన్నవించుకుని, ఫలితం కనిపించకపోతే, ప్రత్యక్ష ఆందోళనకు దిగాలనే ఆలోచనలోనూ ఉన్నట్టు సమాచారం. ఇదిట్లాఉంటే... కొందరు తహసీల్దార్‌లు ఏకంగా సీఎం దగ్గరకు ఈ గందరగోళాన్ని తీసుకెళ్లి సరిదిద్దాలని కోరే ఆలోచనలో ఉంటే, మరోపక్క ఎంపీడీఓలు కూడా రాష్ట్ర మంత్రి లోకేష్ దగ్గరకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసిన మార్పులవల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.

ముసాయిదా ముద్రణకు సిద్ధం

పట్టభద్రుల దరఖాస్తులు దాదాపు పరిష్కారం

బుధవారం సాయంత్రానికి 5 శాతమే పెండింగ్

ఓటు కోసం 3 లక్షల 32 వేల 783 మంది దరఖాస్తు

23న డ్రాఫ్టు లిస్టు విడుదల చేస్తామన్న ఈఆర్‌వో కాజావలి

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నిక కోసం జరుగుతోన్న ఓటరు నమోదు ప్రక్రియ ముసాయిదా జాబితాల ప్రచురణ దశకు చేరుకున్నది. నోటిఫికేషన్ ప్రకారం ఆమోదించిన దరఖాస్తుదారుల పేర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణకు చర్యలు చేపట్టారు. బుధవారం అర్ధరాత్రి వరకు దరఖాస్తుల పరిష్కారానికి సమయం ఉండటంతో పెండింగ్‌లో ఉన్న 5 శాతం కూడా క్లియర్ చేసి డ్రాఫ్టు ఓటరు లిస్టుని ప్రిం టింగ్‌కు పంపుతామని ఈఆర్‌వో ఎన్‌ఎస్‌కే కాజావలి తెలిపారు. ఈసీ ఆమోదంతో ఈ నెల 23న తుది ఓటర్ల జాబితాని ప్రచు రించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు హార్డ్/సాఫ్టు కాపీలను అందజేస్తామన్నారు. పట్టభద్రులు ఈ దఫా ఓటరు నమోదులో ఎక్కువగా ఆన్‌లైన్ సర్వీసులను వినియోగిం చుకున్నారు. ఈసీఐ వెబ్‌సైట్ ద్వారా ఫారం-18లను పంపించారు. బాపట్ల జిల్లాలో 21519, ఏలూరులో 14709, గుంటూరులో 91013, కృష్ణాలో 48040, ఎన్‌టీఆర్‌లో 58154, పల్నాడులో 50300 మంది కలిపి మొత్తం 2 లక్షల 83 వేల 735 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అలానే ఆఫ్‌లైన్‌లో ఈ ఆరు జిల్లాల నుంచి 49048 మంది దరఖాస్తులు పెట్టారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కలిపి మొత్తం 3 లక్షల 32 వేల 783 మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేశారని ఎన్నికల అధికారులు తెలిపారు.

దరఖాస్తుల పరిష్కారం ఇలా..

ఓటరు దరఖాస్తులను మూడు దశల్లో పరిష్కరించారు. తొలుత బీఎల్‌వోల ద్వారా కార్యశాలలో దరఖాస్తులను పరిశీలింపచేశారు. ఆ తర్వాత వాటిని ఏఈఆర్‌వోలు పరిశీలించి ఆమోదించారు. వాటిని ఆఖరుగా ఈఆర్‌వో పరిశీలించి ఆమోదం తెలిపారు. అర్హతలు సరిగా జత చేయని దరఖాస్తులను తిరస్కరించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో 2 లక్షల 35 వేల 295 ఆమోదించారు. 32,093 తిరస్కరించారు. ఇంకా ఏఈఆర్‌వో లాగిన్‌లో 11,758, ఈఆర్‌వో వద్ద 4589 పెండింగ్‌లో ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో 47742 ఆమోదించారు. 980 తిరస్కరించారు. 326 పెండింగ్‌లో ఉన్నాయి.


గుంటూరులోనే ఎక్కువ దరఖాస్తుల పెండింగ్

బుధవారం సాయంత్రానికి పెండింగ్ ఉన్న 5.01 శాతం దరఖాస్తుల్లో ఎక్కువ సంఖ్యలో గుంటూరు జిల్లాలోనివే ఉన్నాయి. మొత్తం 16673 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వాటిల్లో 11249 గుంటూరు జిల్లాలోనివే. గుంటూరు నగరంలోనివి ఎక్కువగా ఉన్నాయి. బాపట్లలో 751, ఏలూరులో 354, కృష్ణలో 277, ఎన్‌టీలో 1443, పల్నాడులో 2599 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఇవన్నీ అర్ధరాత్రి లోపు క్లియర్ చేసి ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణ కోసం పంపుతామని ఈఆర్‌వో కాజావలి తెలిపారు.

డిసెంబరు 9వ తేదీ వరకు ఓటుహక్కుకు అవకాశం

- ఈఆర్‌వో ఎన్‌ఎస్‌కే కాజావలి

కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికలో ఓటుహక్కు పొందేందుకు డిసెంబరు 9వ తేదీ వరకు అవకాశం ఉందని ఈఆర్‌వో ఎన్‌ఎస్‌కే కాజావలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముసా యిదా ఓటర్ల జాబితా ఈ నెల 23వ తేదీన ప్రచురిం చడం జరుగుతుందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబి తాపై అభ్యంతరాలను అదే రోజు నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుం దన్నారు. అర్హత ఉండి ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకుంటే వారు కూడా డిసెంబరు 9లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కొత్త దరఖాస్తులు కూడా స్వీకరిస్తామ న్నారు. అభ్యంతరాలను డిసెంబరు 25న పరిష్కరించి 30న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తామని చెప్పారు.



వివా, వీవీఐటీలో శ్రీశృంగేరీ పీఠాధిపతి

విద్యార్థులకు విధుశేఖరభారతీస్వామి ఆశీర్వచనాలు



స్వామీజీ వద్ద ఆశీర్వాదం పొందుతున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ దంపతులు

పెదకాకాని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయ యాత్రా మహో త్సవంలో భాగంగా గుంటూరు పర్యటనకు విచ్చేసిన శృంగేరి శారదా పీఠం జగద్గురువు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ మహాస్వామి బుధవారం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మహాస్వామి విద్యార్థులకు, అధ్యాపకులకు ఆశీర్వచనాలను అందజేశారు. తొలుత కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ దంపతులు స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు అనుగ్రహభాషణం చేశారు. విద్యార్థులను కేవలం పిల్లలు అని మా త్రమే అనుకూడదని వారు దేశం యొక్క అపారమైన భవిష్యత్ అన్నా రు. దృఢమైన లక్ష్యం ఎంచుకుని వాటిని సాధించేలా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. గొప్పవాళ్లం కవాలనుకుంటే సరిపోదని దానికి తీవ్రమైన కోరిక, కృషి కలిగి ఉండాలని ఉపదేశించారు. దేశం, ధర్మం రెండూ రెండు కళ్లవంటివని వాటిని పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరి బదరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని యానిమేటర్ల నిరసన

గుంటూరు(తూర్పు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యానిమేటర్లుకు రావాల్సిన ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, మూడు సంవత్సరాల కాలపరి మితి జీవోను రద్దు చేయాలని యానిమే టర్స్ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. జిల్లా డీఆర్డీఏ కార్యాలయం ఎదుట బుధవారం యానిమేటర్లు నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాని మేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మూడు సంవత్సరాలకే యానిమే టర్లు ఉద్యోగం వదిలి వెళ్లాలనడం సరైనది కాదన్నారు. యాని మేటర్లకు సెల్‌ఫోన్లు, 5జీ నెట్‌వర్క్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కే పద్మ, విజయలక్ష్మి, శారద పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- మృత్యుతో పోరాడుతున్న భర్త

పెదకాకాని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త మృత్యువుతో పోరాడుతున్న సంఘటన బుధవారం పెదకాకానిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదకాకాని సదాశివ నగర్‌లో పావని, కృష్ణ దంపతులు నివాసం ఉంటున్నారు. కృష్ణ అన్ని ఫంక్షన్లకు ఈవెంట్ మేనేజ్మెంట్ చేస్తుంటాడు. భార్య పావని(వయస్సు 26సం) మంచి సింగర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. దీంతో వీరిద్దరూ కలిసి ఈవెంట్ ఆర్గనైజేషన్ చేస్తుంటారు. వ్యక్తిగత పనులపై విజయవాడ వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటి వద్ద నుంచి పెదకాకాని మెయిన్ సెంట ర్‌కు వస్తుండగా, సెంటర్ సమీపంలోని గౌడ పాలెం కార్నర్ వద్ద ఓ ప్రైవేటు స్కూలు బస్సు బ్రేక్ ఫెయిల్ అయ్యి అతివేగంగా వచ్చి వీరి వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో పావని అక్కడికక్కడే మృతి చెంద గా, ఆమె భర్త కృష్ణ తీవ్రగాయాలతో మృత్యు వుతో పోరాడుతున్నాడు. కాకాని రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పావని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు మార్చురీకి తరలించారు.

పొన్నెకల్లు జడ్పీస్కూల్ పీఈటీ సస్పెన్షన్

- పాఠశాల హెచ్‌ఎంకు చార్జిమెమో జారీ

గుంటూరు(విద్య),నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలం పొన్నెకల్లులోని డీవీకేఆర్ జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి షేక్ సమీర్ మరణించిన సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల పీఈటీ వై రాజారెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈవో సీవీ రేణుక బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల డ్రిల్ సమయంలో 9మంది విద్యార్థులు గోడదూకి బయటకు వెళ్లారు. వారు మరో విద్యార్థి సమీర్‌తో కలిసి ఈతకు వెళ్ళారు. సంఘటనలో సమీర్ బావిలో పడి మరణించిన విషయం తెలిసిందే. దీనికి పీఈటీ నిర్లక్ష్యమే కారణమని డిప్యూటీ డీఈవో ఇచ్చిన నివేదికతో పీఈటీ రాజారెడ్డిని విధులు నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు. అదేవిధంగా పాఠశాల హెచ్‌ఎం జరీనా ముంతాజ్‌బేగంపై చార్జీమెమోను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి జారీ చేశారు. హెచ్‌ఎం నుంచి వచ్చే సమాధానం ఆధారంగా విచారణ జరిపి ఆమెపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆర్‌జేడీ స్పష్టం చేశారు.

రౌడీషీటర్ బోరుగడ్డ బెయిల్ పిటిషన్లు డిస్మిస్

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌పై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల్లో వేసిన బెయిల్ పిటిషన్లు డిస్మిసయ్యాయి. బెయిల్ కోసం బోరుగడ్డ తరఫున దాఖలైన రెండు పిటిసన్లపై విచారించిన ఐదో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ లత వాటిని డిస్మిస్ చేస్తూ బుధవారం ఆదేశాలిచ్చారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డపై రాష్ట్రవ్యాప్తంగా అనేక కేసులు నమోదు కాగా పోలీసులు పిటి వారింట్లపై ఆయా కోర్టులలో హాజరు పరుస్తున్నారు.

వెనుతిరిగిన పట్టాభిపురం పోలీసులు

రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పిటి వారెంట్‌పై మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచేందుకు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి వెళ్ళిన పట్టాభిపురం పోలీసులకు నిరాశే ఎదురైంది. అనంతపురం జిల్లాలో నమోదైన ఓ కేసులో అక్కడి పోలీసులు పిటి వారంట్‌పై కేంద్ర కారాగారంలోనే కస్టడీలోకి తీసుకుని జూమ్ యాప్ ద్వారా వర్చువల్‌గా సంబంధిత మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచగా 14 రోజులు రిమాండ్ విధించారు. అయితే పట్టాభిపురం పోలీసుల వారెంట్ గడువు బుధవారంతో ముగియడంతో వారు వెనుతిరిగారు.

దౌర్జన్యం కేసులో ముగ్గురి పేర్లు వెల్లడి

ముగిసిన తుళ్లూరు పోలీసుల విచారణ

గత అనుభవాల దృష్ట్యా ఈ దఫా తుళ్లూరు పోలీసులు రౌడీషీటర్ బోరుగడ్డ విషయంలో కాస్తంత కటువుగానే వ్యవహరించారు. బోరుగడ్డను రెండు కేసుల్లో రెండు రోజులు పాటు కస్టడికి అనుమతిస్తూ మంగళగిరి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాజమహేంద్రవరం నుంచి తుళ్లూరు తీసుకువచ్చి తిరిగి కోర్టులో హాజరు పరచడానికే సమయం సరిపోతుందని, విచారణకు సమయం చాలదని పోలీసులు కోర్టును అభ్యర్థించడంతో కస్టడి సమయాన్ని పొడిగించారు. దీంతో తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బోరుగడ్డను రెండు రోజుల పాటు విచారించారు. విచారణ సమయంలో ఆయనను లాకప్‌లోనే ఉంచారు. చివరకు మధ్యాహ్న భోజనం కూడా లాకప్‌లోకే అందించారు. కూర్చునేందుకు ఇనుప కుర్చీ ఇవ్వడంతో పాటు సాధారణ ఖైదీలు వెళ్లే బాత్రూం వినియోగించేలా చూశారు. ఈ ఏడాది మే 8న ఎన్నికల సందర్భంగా తుళ్లూరుకు రెండు కార్లలో వెళ్లి అక్కడ ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిపై దౌర్జన్యం, దానిని చిత్రీకరిస్తున్న ఏబీఎన్ విలేకరిపై దాడితో పాటు దాబా హోటల్‌లోని సిబ్బందిని కత్తులతో బెదిరించి దౌర్జన్యం చేసిన ఘటనలపై బోరుగడ్డపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనలో బోరుగడ్డతోపాటు మరో నలుగురు వరకు పాల్గొన్నట్లు అప్పట్లో పోలీసులు గుర్తించారు. అయితే వారు ఎవరనేది తాజా విచారణలో బోరుగడ్డ నుంచి ముగ్గురి వివరాలు రాబట్ట గలిగారు. తన కారు డ్రైవర్ లాం గిరి, బంధువు సమర్పన్, రాజారావు తనతో పాటు పాల్గొన్నట్లు బోరుగడ్డ పోలీసులకు చెప్పాడు. బోరుగడ్డ చెప్పిన ముగ్గుర్ని అరెస్టు చేయాల్సి ఉంది. తనకు సయాటికా ఉందని విచారణకు అవకాశం ఇవ్వరాదని బోరుగడ్డ మేజిస్ట్రేట్‌కు సూచించగా అసలు సయాటికా ఎక్కడ వస్తుంది అని మేజిస్ట్రేట్ ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేకపోయాడు. దీంతో విచారణ సందర్భంగా పోలీసులకు, కోర్టులకు సహకరించాలని మెజిస్ట్రేట్ ఆదేశించడంతో అలాగేనంటూ తల ఊపుతూ బోరుగడ్డ వెనుతిగాడు. అయితే బోరుగడ్డ రెండు రోజుల విచారణలో పోలీసులకు సహకరించలేదని తెలిసింది. మొదటి రోజు చెప్పిన సమాధానాలకు రెండో రోజు చెప్పిన సమాధానాలకు పొంతన లేదని సమాచారం.



విజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న పర్చూరు క్రికెట్ ప్రతినిధులు

క్రికెట్ క్రీడా ప్రాంగణం పరిశీలన

పర్చూరు, నవంబరు 20 (ఆంధ్రప్రదేశ్) : పర్చూరులోని రుగ్వేద్ క్రికెట్ ఏరీనా క్రీడా ప్రాంగణాన్ని ఆంధ్రా క్రికెట్ గ్రౌండ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌చార్జి అధ్యక్షుడు, సౌత్‌జోన్ కన్వీనర్ బీ విజయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. పర్చూరు నియోజకవర్గంలోని క్రికెట్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో ఏసీఏ బృందం ఈ క్రికెట్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. ప్రాంగణం పరిస్థితులు, వసతులు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రికెట్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసి జిల్లా, రాష్ట్ర, రంజీ స్థాయి ఆటల పోటీలను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పర్చూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏసీఏ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ గౌతమ్, ఇంటూరి వంశీ, తులసి శ్రీనివారావు, చెరుకూరి శ్రీధర్ (చింపయ్య) తంగెళ్ల మల్లికార్జునరావు, మధుబాబు, మాధవరావు, సత్యనారాయణ, రమేష్, పఠాన్‌సమీర్, రాజేష్, బాజీ, గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అమెజాన్ కంపెనీ ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన సెయింట్ ఆన్స్ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న సెయింట్ ఆన్స్ ప్రతినిధులు

చీరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమెజాన్ కంపెనీ ఇంటర్న్‌షిప్ కోసం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలలో అర్హత సాధించి తమ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కళాశాలలో బుధవారం ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన బీటెక్ డేటా సైన్స్ విభాగంలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గోపు సింధూజను కళాశాల యాజమాన్య ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్ బాబు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింధూజకు ఇంటర్న్‌షిప్ 6నెలలు కాలపరిమితి ఉంటుందని, నెలకు రూ.1.10 లక్షలు వేతనం ఇతర సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు. అనంతరం 2025లో బెంగళూరులోని అమెజాన్ కంపెనీ కార్యాలయంలో ఉద్యోగంలో చేరాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి నూతలపాటి పూర్ణచంద్రరావు, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ సి.సుబ్బారావు (డైరెక్టర్, అక్రిడేషన్స్), వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్‌గా రామకృష్ణ

పర్చూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గ సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్‌గా తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గోరంట్ల రామకృష్ణను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియమించారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీచేశారు. పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేసేందుకు పార్టీ నాయకులను సమన్వయం చేసేలా పని చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు విధిగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఏలూరి పిలుపిచ్చారు. నాయకులు ఆయా మండలాల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు.

అడకత్తెరలో.. వీఆర్వోలు

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఇదికూడా జరుగుతోంది. ఆ జాబితా పరిశీలన కూడా ఏకకాలంలోనే జరుగుతోంది. ఇది కాక ప్రతి సంవత్సరం కొత్త ఓట్ల చేరికలకు సంబంధించి 2025 జనవరి 5 నాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పూర్తిచేసేలా స్పెషల్ సమ్మరీ రివిజన్ కూడా జరుగుతోంది. వీటన్నిటికీ వీఆర్‌ఓలు బీఎల్‌ఓ హోదాలో హాజరు కావలసిందే. ఎన్నికల విధుల్లో బీఎల్‌ఓలుగా ఆయా గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో వీఆర్‌ఓలనే నియమిస్తారు. వారు చాలకుంటే ఇతర శాఖల సిబ్బందిని కూడా బీఎల్‌ఓలుగా తీసుకునే అధికారం ఉండటంతో ఇతర సిబ్బందినికూడా దీనికి ఉపయోగిస్తున్నారు. ఇదిట్లా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం హౌస్‌హోల్డ్ సర్వే చేపట్టింది. దీనికి ఇప్పటికే సచివాలయ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. అయితే సర్వే వేగవంతం కావటంలేదనే వత్తిడి కూడా ప్రభుత్వం నుంచి వస్తుండటంతో చాలా మండలాల్లో ఎంపీడీఓలు సచివాలయ సిబ్బందినే కాకుండా వీఆర్‌ఓలను కూడా సర్వే విధులకు పంపుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ సమన్వయంతో ఉన్న మండలాల్లో వీరి సమస్య పెద్దగా లేకున్నా, కొన్ని మండలాల్లో మాత్రం అగ్గి రాజుకుంటోంది.

వైసీపీ సర్కారు పెట్టిన చిచ్చుతో...

గతంలో రెవెన్యూ శాఖ కింద పనిచేసే సిబ్బంది మొత్తానికి వేతనాలు సిద్ధంచేసి పంపే అధికారం ఆయా మండలాల తహసీల్దార్‌లకే ఉండేది. వైసీపీ సర్కారు వచ్చాక దీనిలో తీవ్ర గందరగోళ పరిస్థితిని తీసుకొచ్చింది. వీఆర్‌ఓల వేతనాలు వేసే అధికారం ఎంపీడీఓలకు అప్పగించారు. అయితే ఇక్కడా మరో మెలిక ఉంది. వీఆర్‌ఓలలో గ్రేడ్-1, గ్రేడ్-2 అనే రెండు కేటగిరీలు చేశారు. పాత కాలం నుంచి ఉన్న వీఆర్‌ఓలను గ్రేడ్-1 కింద ఉంచి, వారికి జీతం తహసీల్దార్ పరిధిలోనే ఇచ్చేలా పాత పద్ధతినే ఉంచేస్తే, వీఆర్‌ఏలు, ఇతర శాఖల నుంచి ప్రమోషన్‌పై వచ్చిన వీఆర్‌ఓలను గ్రేడ్-2 కింద కేటాయించారు. వీరికి మాత్రం తహసీల్దార్ కాకుండా ఎంపీడీఓలు వేతనాలు వెయ్యాల్సి ఉంటుంది. అటు సచివాలయంలోనూ విలేజ్ రెవెన్యూ సెక్రటరీలు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరికీ ఎంపీడీఓలే వేతన బిల్లులు పంపాల్సి ఉంటుంది. గ్రేడ్-2 కింద ఉన్నవారు కూడా రెవెన్యూ కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే తాజాగా పెరిగిన పని వత్తిడి కారణంగా ఎవరికివారు మా సిబ్బందంటే మా సిబ్బందంటూ వారికి విధులు అప్పగించేస్తున్నారు. అయితే రెండు చోట్ల విధులకు హాజరు కాలేక సతమతమవటం వీఆర్‌ఓల వంతవుతోంది. ఈ తరహా అనాలోచిత మార్పులు చేసిన వైసీపీ సర్కారు నిర్ణయాల కారణంగా ఇప్పుడు శాఖల మధ్యే సమన్వయం లోపించటానికి, వారి మధ్య వివాదాలకు కారణమవుతోంది. తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని, పెదనందిపాడు, అటు బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మరికొన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఈ వ్యవహారం తారాస్థాయికి చేరితే, మరికొన్నిచోట్ల సర్దుకుపోతూ, పని వత్తిడి వచ్చినప్పుడు బయటపడుతూ వస్తున్నారు. తెనాలి, మరికొన్నిచోట్ల వీఆర్‌ఓలపై తహసీల్దార్‌లు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పరిశీలనా విధులకు రావాలని తెగేసి చెబుతుంటే, ఎంపీడీఓలు తాము చెప్పిన విధులకు రాకుంటే మెమోలే జారీ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని వీఆర్‌ఓలు ఆరోపిస్తున్నారు. తెనాలిలో ఇప్పటికే ముగ్గురుకి మెమోలు ఇస్తే, ఒకరి వేతనం ఆపుతామని బెదిరించారని, నెలనెలా వచ్చే జీతంతో బతికేవారిపై ఇటువంటి బెదిరింపులకు దిగితే ఎట్లాగంటూ వారూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వీఆర్‌వోల సంఘంలో ఈ వివాదాన్ని పెట్టి తేల్చుకుంటామంటూ వారూ తగ్గకుండా హెచ్చరికలు చేయడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాల వీఆర్‌వోలు ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళితే, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కలెక్టర్‌కు విన్నవించుకుని, ఫలితం కనిపించకపోతే, ప్రత్యక్ష ఆందోళనకు దిగాలనే ఆలోచనలోనూ ఉన్నట్టు సమాచారం. కొందరు తహసీల్దార్‌లు ఏకంగా సీఎం దగ్గరకు ఈ గందరగోళాన్ని తీసుకెళ్లి సరిదిద్దాలని కోరే ఆలోచనలో ఉంటే, మరోపక్క ఎంపీడీవోలు కూడా లోకేష్ దగ్గరకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసిన మార్పులవల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.

అద్దంకిలో తగ్గిన నైట్, డే బీట్‌లు

- బ్యాంక్‌లు, గోల్డ్ షాపుల వద్ద కాపు కాసి ఉంటున్న దొంగలు
- పగలు రెక్కీ.. రాత్రి చోరీలు
- తరచూ దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



చిందరవందరగా పడిఉన్న వస్తువులు, వాసవీనగర్‌లో చోరీ జరిగిన ఇంట్లో తెరిచి ఉంచిన బీరువా (ఫైల్)

అద్దంకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో చోరీలు బాగా పెరిగాయి. గతంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు జరగగా, తాజాగా జరిగిన చోరీలలో అత్యధిక భాగం ఇళ్లలో మనుషులు ఉండగానే చోరీలు జరుగుతుండడంతో ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తుంది. ఇటీవల జరిగిన పలు చోరీలను పరిశీలిస్తే పగలు సమయంలో పక్కాగా రెక్కీ నిర్వహించి రాత్రికి చోరీలకు పాల్పడుతున్నట్లు తేటతెల్లం అవుతుంది. ప్రధానంగా బ్యాంక్‌లు, గోల్డ్ షాపులు ఉన్న ప్రాంతాలలో దొంగలు కాపు కాచి ఉంటున్నట్లు కన్పిస్తుంది. ఈ క్రమంలోనే పలు చోరీలలో పెద్ద మొత్తం నగదు, బంగారం కూడా అపహరణకు గురవుతున్నాయి. ఇటీవల అద్దంకి పట్టణంలో జరిగిన రెండు చోరీలను పరిశీలిస్తే కాకానిపాలెంకు చెందిన ఉపాధ్యాయిని చోరీ జరిగిన రోజు సాయంత్రం రామాటాకీస్ బజారులోని ఓ గోల్డ్ షాపు నుంచి గిఫ్ట్ ఇచ్చేందుకు చిన్న ఆభరణం కొనుగోలు చేశారు. అయితే ఆ బంగారంతో పాటు ఇతర అవసరాలకు వినియోగించుకునేందుకు బ్యాగ్‌ను గోల్డ్ షాపులో తీసుకున్నారు. ఇక వాసవీనగర్‌లో విశ్వభారతి స్కూల్ సమీపంలో జరిగిన చోరీ విషయాన్ని పరిశీలిస్తే ఎన్ఎస్పీలో పనిచేసే మహిళ అదే రోజు బ్యాంక్‌కు వెళ్లి వచ్చారు. అయితే బ్యాంక్ నుంచి ఎలాంటి నగదు తీసుకు రాలేదు. నెల రోజుల కిందట ఓ మహిళ గోల్డ్ షాపు నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లగా హ్యాండ్ బ్యాగ్‌లోని బంగారం గొలుసు ఇద్దరు మహిళలు కొట్టేశారు. ఈ సంఘటనలను పరిశీలిస్తే ప్రధానంగా బ్యాంక్‌లు, గోల్డ్ షాపులు ఉన్న ప్రాంతాలలో దొంగలు కాపు కాసి ఉండి, వారి వెంట నడిచి ఇళ్ల సమీపంలో రెక్కీ నిర్వహిస్తున్నారనే అనుమానాలు వస్తున్నాయి. గతంలో పగలు సమయంలో రెండు, మూడు బ్యాచ్‌లుగా బ్లూకోట్స్ సిబ్బంది పగలు సమయంలో నగదు, బంగారం లావాదేవి లు జరిగే ప్రాంతాలలో తిరి గే వారు. ఇక రాత్రి సమయంలో ఏదో ఒక పోలీస్‌స్టేషన్ ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది రెండు వాహనాలలో గస్తీ తిరిగే వారు. అయితే కొంత కాలం గా గస్తీ మొక్కుబడిగా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక పలు సందర్భాలలో అద్దంకి పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా అంతంతమా త్రంగానే పనిచేస్తున్నాయి. దీంతో నిఘా పూర్తిగా అటకెక్కడంతో దొంగలు మరింత రెచ్చిపోయి చోరీలకు పాల్పడుతున్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇళ్లలో మనుషులు నిద్రిస్తుండగానే చోరీలు జరుగుతుండటం మరింత ఆందోళన కలిగిస్తుంది. దొంగలు ఇళ్లలోకి ప్రవేశించిన సమయంలో ఆయా కుటుంబసభ్యులకు మెళకువ వస్తే ప్రాణాలకే ముప్పు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పగలు, రాత్రి సమయాలలో మరింత గస్తీ పెంచి చోరీలను అరికట్టే విధంగా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని అద్దంకి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ప్రగతికి అధికారులు శ్రమించాలి

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండర్ కార్యాలయాన్ని ప్రారంభించిన రైల్వే జీఎం జైన్



క్రాసింగ్ లైన్‌లు పరిశీలిస్తున్న జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే స్టేషన్‌ను బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ సందర్శించారు. విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ ఆనందకుమార్ పటేల్‌తో కలిసి నూతనంగా నిర్మించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోస్ట్ కమాండర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. స్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ శివారులోని రైల్వే క్రాసింగ్ పాయింట్‌ను నిశితంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. వార్షిక తనిఖీలలో భాగంగా వచ్చినట్లు తెలిపారు. గూడూరు - విజయవాడ సెక్షన్‌లో రక్షణ ఏర్పాట్లతో పాటు అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు చెప్పారు. అహర్నిశలు శ్రమించి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. జీఎం వెంట స్టేషన్ సూపరింటెండెంట్ సింగయ్య, సిబ్బంది ఉన్నారు.

మనో వికాస కేంద్రంలో వైద్య పరీక్షలు

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ వెంకటమురళి, జిల్లా కోర్టు భవన సముదాయాల న్యాయాధికారి ఆదేశాల మేరకు చీరాల పరిధిలోని చైతన్య మనో వికాస కేంద్రంలో డీసీహెచ్ఎస్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈక్రమంలో వైద్యులు మానసిక దివ్యాంగులకు వినికిడి , కంటి సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డా.నివేదిత, డా.లాస్య యాదవ్, డా.రవికుమార్, సోషల్ వర్కర్ సుబ్బలక్ష్మీ, నిర్వాహకులు వెంకన్నబాబు, మాధురి పాల్గొన్నారు.

అధిక దిగుబడిపై రైతులకు అవగాహన

యద్దనపూడి, (మార్టూరు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ఖర్చుతో రైతులు అధిక దిగుబడిని ఎలా సాధించాలో ఏవో మేరమ్మ రైతులకు వివరించారు. గన్నవరం, పూనూరు గ్రామాలలో బుధవారం పత్తిని ఆమె పరిశీలించారు. సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు.

తాడేపల్లికి తరలిన జనసేన పార్టీ కార్యకర్తలు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయ్ కుమార్

పర్చూరు, నవంబరు 20 (ఆంధ్రప్రదేశ్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల సంక్షేమ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్‌గా తాడేపల్లిలో బాధ్యతలు స్వీకరించను న్న పెద్దపూడి విజయ్ కుమార్ తన సైనికులతో కలసి బుధవారం తరలివెళ్లారు. ఇంకొల్లు నుంచి పర్చూరు చేరుకున్న విజయ్‌కుమార్‌కు జనసేన కార్యకర్తలతోపాటు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. బొమ్మల సెంటర్‌లో డాక్టర్ అంబేడ్కర్, వంగవీటి మోహన్‌రంగా, ఎన్టీఆర్ విగ్రహాలకు విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాహనాల్లో ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శృంకర శెట్టి చిరంజీవి, విన్నకోట అజయ్, శీరం కుమార్, కందా సురేంద్రబాబు, కారంపూడి సందీప్ తేజ, టీడీపీ నాయకులు విన్నకోట సతీష్, రాజా, వెంకటేష్, రాజేష్, వడ్డెముక్కల అబ్రహం, మార్కు, కిషోర్, దళిత నాయకులు గేరా స్వరాజ్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు 10 వినతులు

అద్దంకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీఎంకు 10 వినతులు వచ్చినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్యలో నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు 10 వినతులు వచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా వినుకొండలో సాయంత్రం 4-45 బయలుదేరే బస్సు సమయాన్ని 5 గంటలకు బయలు దేరే విధంగా మార్పు చేయాలని, బొద్దికూరపాడు నుంచి విజయవాడకు నడుపుతన్న బస్సును ఆదివారం, ఇతర సెలవుదినాలలో కూడా నడపాలని, అద్దంకి నుంచి బొద్దికూరపాడుకు సాయంత్రం సమయంలో రద్దు చేసిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని, బల్లికురవ మీదుగా గుంటూరుకు బస్ సర్వీస్ నడపాలని ప్రయాణికుల నుంచి వినతులు వచ్చినట్లు, వెంటనే అమలు పరిచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు.

సహకార సంఘాల బలోపేతంతోనే అభివృద్ధి



తిమ్మనపాలెంలో సహకార జెండాను ఆవిష్కరిస్తున్న డీసీఏవో తిరుపాల్‌రెడ్డి

మేదరమెట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాలను అభివృద్ధి చేయడం ద్వారా రైతులు, గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఏవో) కే.తిరుపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తిమ్మనపాలెం ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో 71వ సహకార వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సహకార శాఖ జెండాను ఆయన ఆవిష్కరించారు. సహకార సంఘాల్లో రికార్డుల నిర్వహణ పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సంఘాలు అభివృద్ధి చెందితేనే ఉద్యోగులకు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కోపరేటివ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాసరావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుజాత, కోటేశ్వరమ్మ, రావినూతల బ్రాంచి మేనేజర్ ఏ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నాగేంద్రబాబు, సొసైటీ సీఈవో కోటేశ్వరరావు, మండలంలోని సొసైటీల సీఈవోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల సాగుపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు

మార్టూరు, నవంబరు 20 : పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పప్పుదినుసులు సాగుచేసుకోవాలని, వాటి ద్వారా లాభాలు సాధించవచ్చునని మార్టూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా పప్పుదినుసులు సాగుపై అవగాహన కలిగించేందుకు బుధవారం మండలంలోని బొబ్బేపల్లిగ్రామంలో రైతులతో మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పొగాకు అధికంగా సాగు చేయడం ద్వారా డిమాండ్ తగ్గి రైతులు నష్టపోతున్నారన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న సాగుచేసుకోవడం మంచిదన్నారు. అనంతరం వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో శనగ పంటకు గ్రామం యూనిట్ కాగా, వరి, మొక్కజొన్న, జొన్న, మినుము, పెసరకు మండలం యూనిట్‌గా నిర్ణయించారన్నారు. పంట బీమా ప్రీమియాన్ని డిసెంబరు 31నాటికి చెల్లించాలన్నారు. మిగిలిన పంటలకు వచ్చేనెల 15వతేదీ లోపు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి హనుమంతనాయక్, ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రూ.కోట్లలో.. కిక్

(5వ పేజీ తరువాయి)

అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అప్పటి వరకు కొనసాగుతున్న మద్యం పాలసీని మార్చేశారు. ప్రభుత్వ దుకాణాల స్థానే ప్రైవేటు దుకాణాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉండే కేవలం నగదు లావాదేవీలు తొలగించి డిజిటల్ పేమెంట్స్‌ను కూడా అమల్లోకి తెచ్చారు. గత నెల దసరా పండుగ రోజు నుంచి కొత్త మద్యం షాపులు వెలిశాయి. అప్పటి వరకు కేవలం జేబులో నగదు ఉంటే మాత్రమే మద్యం కొనుక్కునే అవకాశం ఉండేది. డిజిటల్ లావాదేవీలు అమల్లోకి రావడంతో క్రెడిట్‌కార్డులు ఉన్నవారు సైతం ఎంచక్కా వైన్ షాపులకు వెళ్లి మద్యం కొనుగోలు చేస్తున్నారు. దసరా పండుగ ముందు వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరికే మద్యం బ్రాండ్ల పేర్లు కూడా వింతగా ఉండేవి. బూమ్..బూమ్, బ్రిటీష్ ఎంపైర్ వంటి బీర్లు, ఆంధ్రగోల్డ్ విస్కీ, హైదరాబాద్ బ్లూ విస్కీ, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీలు వంటివి మాత్రమే అందుబాటులో ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేసిన కొత్త మద్యం షాపుల్లో ఏ బ్రాండ్ మద్యమైనా అందుబాటులోకి వచ్చింది. కింగ్ ఫిషర్, బడ్వైజర్, నాకౌట్ వంటి ప్రముఖ బ్రాండెడ్ బీర్లు దొరుకుతున్నాయి. దీంతో ఈ నెల రోజుల్లో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. గత నెల 16 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు అంటే 30 రోజుల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూ.259 కోట్ల 19లక్షల అమ్మకాలు జరిగాయి. ఇందులో రూ.208 కోట్ల విలువ చేసే మద్యం కేవలం కొత్తగా ఏర్పాటు చేసిన వైన్ షాపుల ద్వారానే జరిగింది. మిగతా అమ్మకాలు బార్లు, క్లబ్‌లలో జరిగాయి. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో భాగంగా గుంటూరు జిల్లాలో 127, పల్నాడు జిల్లాలో 129, బాపట్ల జిల్లాలో 117 కొత్తగా వెలిశాయి. అయితే బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కంటే గుంటూరు జిల్లాలోనే మద్యం దుకాణాల ద్వారా ఎక్కువ అమ్మకాలు జరిగాయి. పల్నాడు జిల్లాలో రూ.93 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.86 కోట్ల మద్యం అమ్మకం జరిగింది. ఇక గుంటూరు జిల్లాలో రూ.115 కోట్లకుపైగా విలువ చేసే మద్యం విక్రయించారు. ఇందులో ఒక గుంటూరు నగరంలోనే రూ.50 కోట్ల మద్యాన్ని కేవలం దుకాణాల ద్వారానే కొనుగోలు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాల్లోనే రూ.34 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.16 కోట్ల అమ్మకాలు జరిగాయి. చిలకలూరిపేట ప్రాంతంలో అత్యధికంగా రూ.13 కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయి. అక్టోబరు 16కు ముందు జగన్ హయాంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండేవి. అప్పటి అమ్మకాలతో బేరీజు వేసుకుంటే ప్రస్తుతం ఇంచుమించు నెలకు రూ.20 కోట్ల అమ్మకాలు పెరిగాయి.

సరఫరాకు మించి రూ.99 మద్యానికి డిమాండ్

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా డిస్టలరీ కంపెనీలకు ఇచ్చిన ఆదేశాల మేరకు నాణ్యతతో కూడుకున్న చౌక మద్యం రూ.99కే అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో తొలుత ఈ మద్యం అందుబాటులో లేదు. అయితే కొద్ది రోజులు ఆలస్యంగానైనా సరే మార్కెట్లోకి రూ.99 మద్యం వచ్చింది. ఈ నేపథ్యంలో వీఎస్‌వోపీ వారి బ్రాందీ(ట్రోపికాన)కు డిమాండ్ విపరీతంగా ఉంది. ఇది డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రస్తుతానికి సరఫరా లేదు. దీంతో డిపోల నుంచి షాపుల నిర్వాహకులు కోరినంత ఇవ్వలేకపోతున్నారు. త్వరలో ఈ బ్రాండ్లను కూడా భారీగా డంప్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

బాలికలకు హక్కులపై అవగాహన

చినగంజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాలికలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణిశ్రీ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు, ఉపాధ్యాయులతో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ నుంచి ఆర్ అండ్ బీరహదారి వరకు ర్యాలీని నిర్వహించారు. విద్యార్థినులకు బాలికల హక్కుల గురించి, ఆడ పిల్లలకు చదువు యొక్క ప్రాముఖ్యతను గురించి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, ఉపాధ్యాయిని కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

దౌర్జన్యంపై మహిళ ఫిర్యాదు

బల్లికురవ. నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో సిమెంట్ దుకాణ యజమాని అచ్చి రాధపై గ్రామానికి చెందిన కొందరు దౌర్జన్యం చేశారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

కొప్పెరపాడు గ్రామానికి చెందిన సిమెంట్ దుకాణ యజమాని రాధ బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. మంగళవారం రాత్రి రాధ తమకు డబ్బులు ఇవ్వాలని గ్రామానికి చెందిన కొందరు నిలదీయగా మనస్థాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. బంధువులు వెంటనే ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించారు. వైద్య శాల నుంచి మహిళ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. కాగా తమ వద్ద రాధ సుమారు రూ.కోటి వరకు అప్పుగా నగదు తీసుకుందని డ బ్బులు ఇవ్వాలని అడిగితే తమపై దౌర్జన్యం చేశారని ఫిర్యాదు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు అడిగితే ఆత్మహత్యాయత్న ప్రయత్నంతో భయపెడుతుందని 30 బాధితులు వాపోతున్నారు.

రోగ నిరోధక టీకాలపై అవగాహన

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సాగు చేస్తున్న రైతులు రోగ నిరోధక టీకాలపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి సుమతి అన్నారు. బుధవారం చీరాల మండల పరిధిలోని గాంధీనగర్, రామకృష్ణాపురం ప్రాంతాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అలాగే వరి, కూరగాయల పంటలను పరిశీలన చేసి సూచనలు అందించారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

మార్టూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సమస్యలు, వాతావరణసమస్యల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలన్నా, భూమిని రక్షించుకోవాలన్నా రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేపట్టాలని ఎంటీఎల్ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలను వివరిస్తూ,ప్లేకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెంటరులో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శశికళ, చంద్రశేఖర్, తులసి, శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

రియల్ వ్యాపారుల నయా దందా

- సిండికేట్‌గా మారి నిబంధనలకు పాతర
- అనుమతులు లేని లేఅవుట్లతో నష్టపోతున్న కొనుగోలుదారులు
- అక్రమ లేఅవుట్ల లెక్క తీస్తున్నామంటున్న రెవెన్యూ అధికారులు
- పూర్తయ్యేదెప్పటికో అంటున్న ప్రజలు
- ఆ లేఅవుట్ల వివరాలు, సర్వే నెంబరు వెల్లడించాలని బాధితుల విన్నపం

చీరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థిరాస్తి వ్యాపారుల్లో పలువురు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. ఎలాంటి అనుమతీ లేకుండా లేఅవుట్లు వేస్తున్నారు. జిల్లాలోనే అత్యధిక అనుమతులు లేని లేఅవుట్లు ఉన్నది చీరాల నియోజకవర్గంలోనే. కొందరు కనీసం ల్యాండ్ కన్వర్షన్ రుసుము కూడా చెల్లించడం లేదు. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. తరువాత విక్రయించేవారిని అడిగినా ప్రయోజనం ఉండడం లేదని వాపోతున్నారు. ఒక వైపు అనధికారిక లేఅవుట్లలో స్థలాలు కొన్నవారికి గృహ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వమని, మౌలిక వసతులు కల్పన జరగదని ఉన్నతాధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. అందుకు సంబంధించి అనధికారిక లేఅవుట్లు జాబితాను తయారు చేసి, బహిరంగ పరిచారు. ఆ తరువాత కూడా అనధికారిక లేఅవుట్లు వెలుస్తూనే ఉన్నాయి. వీటిపై మరలా పూర్తి స్థాయిలో వివరాలను సేకరిస్తున్నామని అధికారులు చెప్తున్నారు.

సిండికేట్‌గా మారుతున్న రియల్టర్లు



వాడరేవు రోడ్డులో వేసిన అనధికారిక లేఅవుట్ (ఫైల్)



216 జాతీయ రహదారి పక్కన అక్కాయిపాలెం పరిధిలో అనధికారిక లేఅవుట్ పనులు (ఫైల్)

రియల్ వ్యాపారుల్లో కొందరు సిండికేట్‌గా మారి తమ దందా సాగిస్తున్నారు. ఆయా సిండికేట్‌లలో పాలక, ప్రతిపక్షాలకు చెందిన వారు ఉండేలా చూచుకుంటున్నారు. సిండికేట్ భాగస్వాముల్లో ఏ ప్రాంతంలో ఎవరికి ఎక్కువ పట్టుంటే అక్కడ వేసే అనధికారిక లేఅవుట్ ఆ వ్యక్తిదని ప్రచారం చేస్తున్నారు. అధికారుల దగ్గర పాలకపక్షానికి చెందిన వ్యక్తులు ముందుంటున్నారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు.

రూపాయిరూపాయి మదుపు చేసి కొనుగోలు చేస్తే ..

సొంతింటి కలను సాకారం చేసుకుందామని ప్రత ఒక్కరికీ ఉంటుంది. కొందరు స్థిరాస్తిగా స్థలాలు, పొలాలపై ముదపు చేస్తుంటారు. ఈ క్రమంలో రూపాయి రూపాయి కూడబెట్టుకుని స్థలాలు కొనుక్కుంటున్న వారిలో పలువురికి తరువాత గృహ నిర్మాణ సమయంలో చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. అనధికారిక లేఅవుట్లకు మౌలిక వసతులు లేకపోవడం, కనీసం ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ కూడా ఇవ్వమని అధికారులు చెప్పడం అందుకు కారణం. దీంతో అక్రమ లేఅవుట్లు వివరాలను సర్వే నెంబరు, పేర్లతో సహా ప్రభుత్వ అధికారులు వెల్లడించి తాము నష్టపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మీ ఫార్మాల్టీ మీకిస్తారు

మీ ఫార్మాల్టీ మీకిస్తారు. వార్తలు రాయొద్దని మీడియాకు, వారి జోలికి వెళ్లకుంటే మీ మంచిచెడులు చూస్తారని అధికారులకు పలువురు రియల్టర్ల తరపున వకాల్తా పుచ్చుకుని రాయబేరాలు నడిపేవారు తెరపైకి వస్తున్నారు. ఇందులో మా స్వార్థం ఏమీ లేదు. అందరూ బాగుండాలనేది మా అభిమతం అని చెప్పిడం విశేషం. అయితే అంతిమంగా అనధికారిక లేఅవుట్లలో కొనుగోలు చేసిన వారు నష్టపోతారు కదా అని అడిగితే సమాధానమే లేదు.

ప్రహరీ రక్షణకు అని చెప్తున్నారు.. వివరాలు నమోదు చేస్తున్నాం



అనధికారిక లేఅవుట్లకు సంబంధించి వివరాలు నమోదు చేస్తున్నాం. కొందరు పక్కాగా లేఅవుట్ కోసం పనులు చేస్తూ, చుట్టూ గోడ కట్టి కూడా అది రక్షణకు ఏర్పాటు చేసుకున్నామని చెప్తున్నారు. వాటి మధ్యలో రాళ్ల వేయకుంటే అది లేఅవుట్ లెక్కలోకి రాదు. వారు కోర్టుకు వెళితే లేఅవుట్ అని నిరూపించలేం. నిలబడదు. అలాంటి వాటి వివరాలను నమోదు చేస్తున్నాం. అంతిమంగా కొనుగోలుదారులు పక్కాగా అనుమతులు ఉంటేనే లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేయాలి.

- గోపీకృష్ణ, తహసీల్దార్, చీరాల మండలం

వివరాలు నమోదు చేస్తున్నాం కొనుగోలుదారులు జాగ్రత్తగా ఉండాలి



ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అనధికారిక లేఅవుట్లు జాబితా తయారు చేస్తున్నాం. గతంలో సేకరించిన వాటి వివరాలు ఇప్పటికే వెల్లడించాం. ఆ తరువాత, అంతక ముందు ఉన్న లేఅవుట్లలో కూడా అనుమతిలేని వాటి వివరాలపై నివేదిక తయారు చేస్తున్నాం. పూర్తి వివరాలతో నివేదికను ఒడా ఛైర్మన్, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అందజేసేందుకు క్షేత్రసాథయి పరిశీలన జరుగుతోంది.

- పార్వతి, తహసీల్దార్, వేటపాలెం మండలం



పత్తిని పరిశీలించిన ఏవో సుబ్బారెడ్డి

అవసరానికి మించి ఎరువులు వాడొద్దు

పంగులూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటలకు అవసరానికి మించి ఎరువులను వాడొద్దని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని కల్లంవారిపాలెం, బూదవాడ గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ రైతులతో కలసి సాగు లో ఉన్న మిరప, పత్తిని పరిశీలించారు. పత్తి లో బోరాన్ లోపంతోపాటు రసం పీల్చే పురుగు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మిరపలో ఆకుమచ్చ తెగులు, తెల్లదోమ అధికంగా ఉందని తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ అలగ్జాండర్, మార్కెటింగ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

బల్లికురవ : రెండు రోజుల చలి చలి పెరిగిందని రైతులు పంటలలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి సూచించారు. బుధవారం మండలం లోని అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బీపీటీ 5204 వరిలో చలి కారణంగా అగ్గి తెగులు, మచ్చలు కనిపిస్తున్నాయని దా ని నివారణకు ట్రైసైక్లోజోల్ 120ని పిచికారీ చేయాలని ఏవో రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వంశీ, వీఏఏ ప్రవీణ్, శ్రీకాంత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ-సర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు



రీ సర్వే సమస్యలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రీ-సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. మండలంలోని చందలూరు గ్రామ పంచాయతీ కార్యలయంలో బుధవారం రీసర్వే సమస్యల పరిష్కారంలో భాగంగా సంబంధిత రైతులతో చర్చించారు. మండల స్థాయిలో రీసర్వే జరిగిన 6 గ్రామాలలో సభలు నిర్వహించి మొత్తం 453 సమస్యలు గుర్తించామన్నారు. వాటి పరిష్కారం కోసం వీఆర్వో, సర్వేయర్‌లను ఒక బృందంగా నియమించి పరిశీలన కోసం రీసర్వే డీటీ, మండల సర్వేయర్, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్‌ను పర్యవేక్షణ అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15లోగా సమస్యలను పరిష్కరించే దిశగా బృందాలు పని చేస్తాయన్నారు. మండలంలోని కశ్యాపురం, రేణంగివరం, అలవలపాడు, చందలూరు, తూర్పు కొప్పెరపాడు, కోటపాడు గ్రామాలలో రీ సర్వే జరిగిందన్నారు. చందలూరులో జరిగిన కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, గ్రామ వీఆర్వో పరశురామిరెడ్డి, గ్రామ సర్వేయర్ నాగార్జున, కంప్యూటర్ ఆపరేటర్ నాగార్జున పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథపాలకురాలు ధనమ్మ, అతిథులు...



చినగంజాంలో బహుమతులతో విద్యార్థులు

చీరాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో వారం రోజుల నుంచి జరుగుతున్న వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథి విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లీశ్వరరావు, సర్విశెట్టి సుబ్బరామయ్య తదితరులు మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథపాలకులు ధనమ్మ మాట్లాడుతూ తమకు సహకరిస్తు న్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిరుల్లీసాఖాన్, చుండూరి కృష్ణమూర్తి, రూపాదేవి, చంద్రమౌళి, కిషోర్, బ్రహ్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాం : గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కొద్ది రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, తెలుగు పాటలు పోటీలలో విజేతలైన వారికి, మ్యూజికల్ ఛైర్స్‌లో గెలుపొందిన మహిళలకు గ్రంథపాలకుడు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈవో బి.అజయ్ బాబు, చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ పుస్తక పఠనం అలవాటు చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముగింపు వారోత్సవాల సందర్భంగా సోపిరాల గ్రామానికి చెందిన ఎన్నారై పర్వతరెడ్డి సునీల్‌కుమార్ సమకూర్చిన రూ.7000 విలువ చేసే టేబుల్‌ను ఆయన తండ్రి రిటైర్డ్ డిప్యూటీ కమర్షియల్ టాక్స్ అధికారి హరిబాబు, మాజీ మున్సిపల్ కమిషనర్ టీఎస్ఆర్ ఆంజనేయులు గ్రంథపాలకునికి అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ కాంతారావు, చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వై.రామాంజనేయులు, భావనారాయణస్వామి యోగా శిక్షణ కేంద్రం అధ్యాపకులు వలివేటి రామానుజన్, పెదగంజాం, మున్నంవారిపాలెం బీడీసీఎల్ నిర్వాకులు దామెదర్‌రెడ్డి, రామాంజనేయులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలికలకు చలికోట్లను అందజేస్తున్న సభ్యులు

దాతల సాయాన్ని వినియోగించుకోవాలి

చినగంజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి అన్నారు. బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఇండియా ఇంటర్నేషల్ వ్యవస్థాపకులు జయశాలి, పీడీ సుందరరావు జయంతి సందర్భంగా ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులు బుధవారం కస్తూర్బా బాలికా విద్యాలయంలోని అనాథ బాలికలలకు చలికోటులను అందజేశారు. కార్యక్రమంలో ఏబీటీసీసీ రాష్ట్ర ఏపో శ్రీనివాసరావు, సీబీటీ వైస్ ప్రిన్సిపాల్ మనోహరావు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లలితకుమారి, కే.సుబ్బారావు, తిరుపతిరావు, కృష్ణ, ఆర్.పౌలు, ఎన్.విజయుడు, ఏలియా, శేషయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

23న విద్యుత్ సమస్యలపై అదాలత్

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న వినియోగదారుల అదాలత్, అవగాహన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని విద్యుత్ ఈఈ జాన్‌థామస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో ఈనెల 23వ తేదీ శనివారం కొత్తపేట రావి సుబ్బరాయుడు కల్యాణ మండపంలో వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఏలూరికి శుభాకాంక్షలు చెప్తున్న టీడీపీ నాయకులు

ఏలూరికి అభినందనలు

ఇంకొల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును బుధవారం ఇంకొల్లు టీడీపీ నాయకులు తాడేపల్లిలో కలిసారు. విజనరీ లీడర్ అవార్డును పొందిన సందర్భంగా ఏలూరిని కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు హనుమంతరావు, శ్రీనివాసరావు, పట్టణపార్టీ అధ్యక్షుడు మార్కు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రావు, శ్రీనివాసరావు, రఫీ, శ్రీను, మీరావలి పాల్గొన్నారు.

చినగంజాం : విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకి పెదగంజాం టీడీపీ నాయకులు బుధవారం అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి విజనరీ అవార్డు పొందిన సందర్భంగా పెదగంజాం గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేకు కట్ చేశారు. అనంతరం నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. భవిష్యత్ ఎమ్మెల్యే ఏలూరి మరెన్నో అత్యున్నత పదువులు, అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆసోది అంజిరెడ్డి, గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాయలయాలలో పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో కె.కుసుమకుమారి హెచ్చరించారు. బుధవారం మండలంలోని వల్లాపల్లి సచివాలయాన్ని ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ రికార్డులు, సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి పరిశీలన చేశారు. అనంతరం అమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా సిబ్బంది పనిచేయాలన్నారు. సమస్య వచ్చినవారికి అది ఎప్పుడు పరిష్కారమవుతుందో చెప్పాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ ఉన్నారు.



వల్లాపల్లి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి



కొప్పెరపాడులో పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పందన

ఒక్కరోజే 250 మంది స్వీకరణ

బల్లికురవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. కొప్పెరపాడు టీడీపీ నేతలు స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు వి.కొప్పెరపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు గ్రామ కూడలీలో ప్రత్యేకంగా సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఒక్కరోజే గ్రామానికి చెందిన 250 మంది కార్యకర్తలుగా పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. టీడీపీ సభ్యత్వ నమోదు తీసుకున్న వారు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ.5లక్షల బీమా అందిస్తుందని నాయకులు అవగాహన కల్పించారు. మరో రెండు రోజుల పాటు ఈ డ్రైవ్ ఉంటుందని చెప్పారు. 900 మంది చేరికే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు నాయకులు నాగినేని సాంబశివరావు, కామినేని శ్యామలరావు, షేక్ అబ్దుల్‌సాహెబ్, పరిటాల పవన్, పూరేటి రామకృష్ణ, మక్కెన ప్రసన్న కుమార్, ప్రసాద్, శ్రీనివాసరావు, ఖాజావలి, బాలయ్య, వరదయ్య పాల్గొన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలతో బోధనపై పట్టు

బల్లికురవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెలవారీగా నిర్వహిస్తున్న కాంప్లెక్సు సమావేశాల ద్వారా ఉపాధ్యాయులకు బోధనపై పట్టు పెరుగుతుందని ఎంఈవో వస్త్రాం నాయక్ పేర్కొన్నారు. బుధవారం బల్లికురవ, వైదన గ్రామాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్సు సమావేశాలలో ఎంఈవో పాల్గొన్నారు. బోధనలో తీసుకోవాల్సిన మెళకువలను ఆయన వివరించారు. అనంతరం వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో కాంప్లెక్సు ఛైర్లన్లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీపై పురోగతి

సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించిన పోలీసులు

దేవాంగపురి(చీరాలటౌన్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల వన్‌టౌన్ పరిధిలోని దేవాంగపురి పంచాయతీలో మంగళవారం జరిగిన చోరీకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు పురోగతి సాధించారు. ఇంటి యజమాని విశ్రాంత ప్రిన్సిపాల్ పృధ్వీ నటరాజ్ కుమార్ హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు సుమారు పది రోజుల కిందట భార్య కలిసి వెళ్లారు. అప్పటికే రెక్కీ నిర్వహించిన పాత నేరస్థుడు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేశాడు. దీంతో సమాచారం అందుకున్న యజమాని వన్‌టౌన్ సీఐ మారీదు శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. ఈక్రమంలోనే ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానంతో పాత నేరస్థుడిగా పోలీసులు కనుగొన్నారు. అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 17 గ్రాముల బంగారం, 20 తులాలు వెండి, కొంత నగదు అపహరణ జరిగినట్లు పోలీసులు తెలిపారు.

నేర నియంత్రణకు సిబ్బంది కృషి చేయాలి

చీరాల డీఎస్పీ మొయిన్

ఇంకొల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు పోలీసు సిబ్బంది కృషి చేయాలని చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ సూచించారు. ఇంకొల్లు పోలీసుస్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను, పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అధునాతన పరిజ్ఞానంతో మండలంలో వివిధ గ్రామాలలో సీసీ కెమోరాలను ఏర్పాటు చేసిన ఎస్సై సురేష్‌ను అభినందించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళ్లలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నిఘా పెంచాలని సూచాంచారు. ఇంకొల్లు సీఐ రమణయ్య, సిబ్బంది ఉన్నారు.

అత్యాచార కేసులో నిందితుడికి యావజ్జీవం

చినగంజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధించింది. పోలీసుల తెలిపిన కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బాలికపై 20-03-2018 సంవత్సరంలో అత్యాచారం జరిగింది. ఆదే గ్రామానికి చెందిన 57ఏళ్ల వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి చినగంజాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి చీరాల డీఎస్పీ వి.శ్రీనివాసరావు దర్యాప్తు ప్రారంభించి విచారించారు. నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈ కేసు ఒంగోలు స్పెషల్ కోర్టు, పోక్సో కోర్టులో విచారణకు రాగా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ స్వీయ పర్యవేక్షణలో చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ సూచనలతో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, చినగంజాం ఎస్ఐ శీలం రమేష్, ఒంగోలు కోర్టు కానిస్టేబుల్ జి.నాగేశ్వరరావు సాక్షులను కోర్టుకు హాజరు పరచగా ప్రత్యేక పీపీ వై.వెంకటేశ్వర్లు, 1వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రాజా వెంకటాద్రి సాక్షులు చెప్పిన సాక్ష్యం, దర్యాప్తు అధికారి భౌతిక ఆధారాలను పరిగణలోనికి తీసుకొని బుధవారం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష (20ఏళ్లు) రూ.10వేల జరిమినా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలికలపై, మహిళల మీద జరుగుతున్న నేరాలను వేగంగా దర్యాప్తు చేసి నిర్ణీత గడువులోపు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతోపాటు సాక్షులను తగు రీతిలో భయం లేకుండా సాక్ష్యం చెప్పేలా తర్ఫీదు ఇవ్వడంవలనే కేసులలో నిందితులకు శిక్షలు పడుతున్నట్లు తెలిపారు. మహిళల మీద, బాలికల మీద చెడు ఉద్దేశంతో ప్రవర్తించేవారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పీపీకి ఎస్పీ అభినందించారు.

మద్యం విక్రయదారుడి అరెస్ట్

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని కొత్తపాలెం, వైకుంఠపురం, పాపరాజుతోట, గాంధీనగర్ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై శ్రీహరి నిర్వహించిన దాడుల్లో దండుబాట రోడ్డులో నివాసముంటున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 14 క్వార్టర్ మద్యం సీసాలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్టీ కాలనీవాసులకు న్యాయం చేయాలి

బల్లికురవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గతంలో ఎస్టీలకు అందజేసిన పట్టాలకు హద్దులు చూపించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండల పరిధిలోని ఎస్ఎల్ గుడిపాడు సిపాయి కాలనీని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాల కిందట ప్రభుత్వం 25 మంది ఎస్టీలకు సర్వే నెంబరు 36, 37లో పట్టాలను మంజూరు చేసిందని, అప్పటి నుంచి వారు అక్కడే ఉంటున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ఆ భూమి తనదని, ఖాళీ చేయాలని గిరిజనులను భయపెడుతున్నారని అన్నారు. ఈ విషయమై అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని ఎస్టీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు రమణయ్య, గొల్లపూడి అంజయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కేఆర్‌కే కళాశాల విద్యార్థుల వైజ్ఞానిక యాత్ర

అద్దంకిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా బుధవారం వివిధ విభాగాల విద్యార్థులు విద్యా వైజ్ఞానిక విహారయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో మండలంలోని మణికేశ్వరం గ్రామంలో చిన్న కాశీగా పిలువబడే మల్లేశ్వర స్వామి ఆలయాలన్ని సందర్శించారు. ఆలయ సమీపంలోని మొక్కల నర్సరీను సందర్శించారు. అక్కడ ఉన్న మొక్కల సమాచారం, వాటి వృద్ధికి అనుసరిస్తున్న సాంకేతిక అంశాలపై జీవశాస్త్రం విభాగ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి. రాజశేఖర్, డాక్టర్ షర్మిలారాణి, డాక్టర్ షేక్ మస్తాన్‌వలి, బి. అ శోక్‌కుమార్, వీ రామకృష్ణ పాల్గొన్నారు.